ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 6 మార్చి 2025



రాయి క్వారీల్లో మైనింగ్ విజిలెన్స్ తనిఖీలు

» వేటజంగాలపాలెంలో నాలుగు క్వారీలు మూత, ఎక్స్‌కవేటర్ సీజ్

అనకాపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేటజంగాలపాలెంలో రాయి క్వారీల్లో గనుల శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు పొందకుండా నిర్వహిస్తున్న నాలుగు క్వారీలను సీజ్ చేశారు. ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి అనకాపల్లి రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో గనుల శాఖ విజిలెన్స్ విభాగం ఏడీ బి.అశోక్‌కుమార్, అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగెడ్డ కాలువ కబ్జా!

పేదల ఇళ్ల కాలనీకి రోడ్డు పేరుతో దర్జాగా ఆక్రమణ

» 'స్థానిక' వైసీపీ, టీడీపీ నేతల లేఅవుట్‌కు రహదారి నిర్మాణం

» 50 అడుగుల కొండగెడ్డలో 40 అడుగుల మేర పూడ్చివేత

» చోద్యం చూస్తున్న జల వనరుల శాఖ అధికారులు



కొండగెడ్డ కాలువను ధ్వంసం చేసి నిర్మించిన రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అధికారంలో లేకపోయినప్పటికీ వైసీపీ నేతల భూకబ్జాలు కొనసాగుతూనే వున్నాయి. ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు భూములను కూడా అడ్డగోలుగా ఆక్రమించేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వీరి అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. పైగా కొంతమంది అధికార పార్టీ నేతలు వీరికి సహకరిస్తున్నారు. పేదల ఇళ్ల కాలనీకి రోడ్డు పేరుతో కొండగెడ్డ కాలవను ఆక్రమించి తమ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు రహదారి నిర్మించుకుంటున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసే వరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. వివరాల్లోకి వెళితే...

పాయకరావుపేట మండలం పీఎల్ పురం, అరట్లకోట, సత్యవరం, మంగవరం గ్రామాలకు చెందిన పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం గత ప్రభుత్వం పీఎల్ పురం రెవెన్యూ పరిధిలో లేఅవుట్ వేసింది. ఇది పోలవరం ఎడమ కాలువ, రైల్వే ట్రాక్‌కు మధ్యలో వుంది. కాలనీ వాసులు పాయకరావుపేటకు, జాతీయ రహదారిపైకి రావడానికి రైల్వే అండర్ పాస్ ద్వారా పీఎల్ పురం గ్రామం మధ్యలో నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే ట్రాక్‌కు తూర్పు వైపున కూటమిలో ఒక పార్టీకి చెందిన నాయకుడికి రెండు ఎకరాలకుపైగా జిరాయితీ భూమి వుంది. వైసీపీకి చెందిన స్థానిక నేత ఒకరు ఈ భూమి పక్కనే వేరే రైతుకు చెందిన రెండున్నర ఎకరాలకుపైగా భూమిని కొంతకాలం క్రితం కొనుగోలు చేశారు. ఈ మొత్తం భూమిలో రియల్ ఎస్టేట్ వెచర్ వేస్తున్నారు. అయితే జాతీయ రహదారి నుంచి లేఅవుట్‌కు వెళ్లడానికి పీఎల్ పురం గ్రామంలో చిన్నపాటి రోడ్డు మాత్రమే వుంది. దీనివల్ల లేఅవుట్‌లో స్థలాలకు మంచి ధర లభించదు. దీంతో ఆ ఇద్దరు నేతల కన్ను సర్వే నంబర్లు 111, 112లలో వున్న కొండగెడ్డ కాలువపై పడింది. జగనన్న కాలనీకి రహదారి సదుపాయం పేరుతో నీటిపారుదల శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండా గెడ్డను ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టారు.



కొండగెడ్డ కాలువ పక్కన వేస్తున్న లేఅవుట్

స్థానికంగా బలవంతులు కావడంతో వీరి చర్యలకు ఎవరూ అడ్డుచెప్పే పరిస్థితి లేదు. పోలవరం ఎడమ కాలువకు పశ్చిమాన వున్న కొండల్లో కురిసిన వర్షం నీరు ఈ గెడ్డ గుండా ప్రవహించి పీఎల్‌పురం రైల్వే అండర్ పాస్‌కు సమీపంలోని మంచినీటి కోనేరులోకి చేరుతుంది. అక్కడ నుంచి జాతీయ రహదారికి సమీపంలో జోడి చెరువు వరకు సుమారు కిలో మీటరు పొడవున 50 అడుగుల వెడల్పుతో కొండ గెడ్డ కాలువ వుంది. దీని పక్కనే లేఅవుట్ వేస్తున్న నేతలు ఈ కొండగెడ్డ కాలువను ఆక్రమించి, సుమారు 40 అడుగుల వెడల్పుతో గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నారు. వర్షం నీరు పోవడానికి పది అడుగుల వెడల్పున కాలువ తవ్వుతున్నారు. ఆ మట్టిని రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్నారు. చాలా రోజుల నుంచి ఈ పనులు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు పట్టించుకోలేదు. అయితే ఇటీవల కొందరు స్థానికులు ఫిర్యాదు చేయడంతో జలవనరుల శాఖ అధికారులు స్పందించి కొండ గెడ్డపై రోడ్డు నిర్మాణ పనులను నిలుపుదల చేయించారు. కాగా కొండగెడ్డ కాలువను ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టడంపై తహసీల్దారు జి.సత్యనారాయణను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా, కొండగెడ్డ కాలువను ఆక్రమించి రోడ్డు వేస్తున్నట్టు ఇటీవల ఫిర్యాదులు అందాయని, దీంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డు పనులు నిలిపేయాలని ఆదేశించామని చెప్పారు. త్వరలో రెవెన్యూ, జలవనరుల శాఖ ఉమ్మడిగా సర్వే నిర్వహించి కొండగెడ్డ ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పడకేసిన పాలన

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో పలు పోస్టులు ఖాళీ

» జడ్సీ, ఏసీపీ, సర్వేయర్ పోస్టుల్లో ఇన్‌చార్జిలు

» ఆర్ఐ, సూపరింటెండెంట్, చైన్‌మెన్ కుర్చీలు ఖాళీ

» బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరికిగాను ప్రస్తుతం ఉన్నది ఒక్కరే

» పదేళ్ల నుంచి భర్తీకి నోచుకోని హెల్త్‌ఆఫీసర్ పోస్టు



జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం

» ఐదు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుల్లో నాలుగు ఖాళీ

» పౌరులకు సేవల్లో జాప్యం

» పట్టించుకోని ఉన్నతాధికారులు

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లిపై మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు శీతకన్ను వేశారు. పాలనకు కేంద్ర బిందువైన స్థానిక జోనల్ కార్యాలయంలో సగానికిపైగా అధికారులు, ఉద్యోగుల పోస్టులు నెలలు/ ఏళ్ల తరబడి ఖాళీగా వుంటున్నాయి. కొన్ని పోస్టులకు ఇన్‌చార్జిలను నియమించినప్పటికీ ఆయా అధికారులు చుట్టంచూపుగా వచ్చి పోతున్నారు. జోనల్ కమిషనర్ (జడ్సీ), అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ), సర్వేయర్ పోస్టుల్లో ఇన్‌చార్జిలు వున్నారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరికిగాను ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. చైన్‌మెన్ పోస్టులు రెండూ ఖాళీగానే ఉన్నాయి. రెవెన్యూ అధికారి, ఆ విభాగం సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా వున్నాయి. హెల్త్‌ఆఫీసర్ పోస్టు పదేళ్ల నుంచి ఖాళీగా ఉంది. ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకుగాను ఒక్కరు మాత్రమే ఉన్నారు.

అనకాపల్లి జోనల్ కార్యాలయంలో పదోన్నతులు, పదవీ విరమణతో ఖాళీ అయిన అధికారులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంలో జీవీఎంసీ ఉన్నతాధికారులు నిర్లిప్త ధోరణి ప్రదర్శిస్తున్నారు. కొన్ని పోస్టులకు వేరేచోట పని చేస్తున్న అధికారులను ఇన్‌చార్జులుగా నియమించడంతో పనులు సక్రమంగా జరగడంలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జి జోనల్ కమిషనర్‌గా టీవీ రమణ వ్యవహరిస్తున్నారు. ఈయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సెక్రటరీగా పనిచేస్తున్నారు. విశాఖ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమైన సమావేశాలుంటే ఆ రోజు ఇక్కడికి వచ్చే పరిస్థితి లేదు. మిగిలిన రోజుల్లో ఉదయం ఆరు గంటలకే అనకాపల్లి, మధ్యాహ్నం తిరిగి విశాఖ వెళుతున్నారు.

ఇక జోన్‌లో అతి ముఖ్యమైన టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారులు, సిబ్బంది కొరత అధికంగా వుంది. ఏడు నెలల నుంచి ఖాళీగా వున్న టౌన్‌ప్లానింగ్ అధికారి పోస్టును ఇటీవల భర్తీ చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా గాజువాకకు చెందిన ఏసీపీ వెంకటరావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈయన ఎక్కువ సమయం గాజువాకలోనే వుంటున్నారు. సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉండడంతో గాజువాక సర్వేయర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరికి ఒక్కరే ఉన్నారు. చైన్‌మెన్ పోస్టులు రెండూ ఖాళీగానే ఉన్నాయి.

రెవెన్యూ విభాగానికి వస్తే.. ఇక్కడ ఆర్ఓగా పనిచేసిన కుమార్ బదిలీ అయి సుమారు ఏడాదిన్నర కావస్తున్నది. ఇటీవల వరకు సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన సురేశ్ ఆర్ఓగా కూడా బాధ్యతలు నిర్వహించారు. గత నెల చివరి వారంలో పదోన్నతి రావడంతో విశాఖ వెళ్లిపోయారు. దీంతో ఆర్వో, సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పారిశుధ్య విభాగంలో హెల్త్‌ఆఫీసర్ పోస్టు పదేళ్ల నుంచి భర్తీకి నోచుకోలేదు.. ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకుగాను ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉన్నారు. పారిశుధ్య కార్మికులు 199 మంది వున్నారు. అయితే 15 ఏళ్ల క్రితం మునిసిపాలిటీగా ఉన్నప్పుడు 300 మంది పారిశుధ్య కార్మికులు వుండేవారు. పదవీవిరమణ చేయడంతో ఖాళీఅయిన పోస్టులను భర్తీ చేయకపోవడంతో పారిశుధ్య కార్మికుల్లో మూడింట ఒక వంత మంది తగ్గారు. దీనివల్ల పట్టణంలో పారిశుధ్యంపై ప్రభావం పడుతున్నది. ఇక ఇంజనీరింగ్ విభాగంలో తాగునీటి సరఫరా ఈఈగా పనిచేస్తున్న శేఖర్ వర్క్సు విభాగం ఈఈగా కూడా వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అనకాపల్లి జోనల్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు పూర్తిస్థాయిలో వుండేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆశలకు అందలం

గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు

» 30 ఏళ్లు సర్వీసు పూర్తయితే రూ.1.5 లక్షల గ్రాట్యూటీ

» పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంపు

» రెండు కాన్పులకు ఆరు నెలలపాటు ప్రసూతి సెలవులు

» ఎన్నికల హామీలను అమలు చేస్తూ ఉత్తర్వులు

» జిల్లాలో 1,475 మంది ఆశ కార్యకర్తలకు లబ్ధి



ఆశ కార్యకర్తలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సేవాభావంతో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. 30 ఏళ్లపాటు పనిచేసిన ప్రతి ఆశ కార్యకర్తకు గ్రాట్యూటీ కింద రూ.1.5 లక్షల వరకు అందనుంది. ఇంకా తొలి కాన్పు సమయంలో మూడు నెలలు, రెండో కాన్పు సమయంలో మూడు నెలలపాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వనున్నది. ఉద్యోగ విరమణ వయస్సును మరో రెండేళ్లు.. అంటే 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో వున్నప్పుడు ఆశ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లు అందజేసింది. అర్హులైన ఆశ కార్యకర్తలకు ఏఎన్ఎం నియామకాల్లో ప్రాధాన్యం ఇచ్చింది. గౌరవ వేతనాన్ని పెంచింది. గత వైసీపీ ప్రభుత్వం ఆశ కార్యకర్తలతో కరోనా వైరస్ ప్రబలిన సమయంలో గొడ్డు చాకిరి చేయించుకున్నదే తప్ప ఎటువంటి అదనపు ప్రయోజనం చేకూర్చలేదు. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తామని గత ఏడాది ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు హామీ ఇచ్చారు. అన్నట్టుగానే గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఆశ కార్యకర్తలు చేస్తున్న సేవలను కూటమి ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగులకు ఇచ్చే ప్రోత్సహకాల్లో కొన్నింటిని ఆశ కార్యకర్తలకు కూడా వర్తింపజేయనున్నట్టు ప్రకటించింది. ఆశ కార్యకర్తలకు గ్రాట్యూటీ, వేతనంతో కూడిన ప్రసూతి సెలవుల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆశ కార్యకర్తల ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో ఆశ కార్యకర్తలకు రూ.1.5 లక్షలు గ్రాట్యూటీగా చెల్లించనున్నది. ఆశ కార్యకర్తలకు తొలి కాన్పు సమయంలో మూడు నెలలు, రెండో కాన్పు సమయంలో మూడు నెలల చొప్పున వేతనంతో కూడిన సెలవులు ఇవ్వనున్నది. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 1,475 మంది ఆశ కార్యకర్తలకు లబ్ధి కలగనున్నది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన వరాలపై ఆశ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని ఆశ కార్యకర్తల సంఘ జిల్లా అధ్యక్షురాలు కాకర శాంతి విజ్ఞప్తి చేస్తున్నారు.

దట్టంగా పొగమంచు

సబ్బవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ఆరంభమైనప్పటికీ మంచు ప్రభావం కొనసాగుతూనే వుంది. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు తెరలు వీడలేదు. విజిబిలిటీ వంద మీటర్ల కన్నా తక్కువకు పడిపోయింది. వాహనాలకు హెడ్‌లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. పొగమంచు కారణంగా రైతులు పొలం పనులను ఆలస్యంగా చేపట్టారు. కాగా ఉదయం పొగమంచు, మధ్యాహ్నం అధిక ఎండ ప్రభావంతో కూరగాయ పంటలకు తెగుళ్లు సోకే అవకాశం వుందని రైతులు చెబుతున్నారు. అదే విధంగా మామిడి, జీడిమామిడి తోటల్లో పూత రాలిపోయే ప్రమాదం వుందని, చీడపీడలు కూడా ఆశిస్తాయని ఆయా రైతులు వాపోతున్నారు.



సబ్బవరంలో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

బైక్‌పై వెళుతున్న యువకుడిపై కత్తితో దాడి

» అనకాపల్లి మండలం కుంచంగి కూడలి వద్ద ఘటన

» తీవ్రగాయాలతో ఆస్పత్రికి తరలింపు



నూకేశ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

» అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారణ

» మృతుడి సొంతూరు బుచ్చెయ్యపేట మండలం కరక గ్రామం

- 8లో

గంజాయి నియంత్రణకు నిరంతర నిఘా

బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు

» నేరాల అదుపునకు రాత్రిపూట గస్తీ ముమ్మరం

» పోలీసు అధికారులకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం

» నాతవరం, గొలుగొండ, కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్ల సందర్శన



నాతవరంలో పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సినా



కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్ నూతన భవనాలను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

నాతవరం/ గొలుగొండ/ కృష్ణాదేవిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాను పూర్తిగా నియంత్రించేందుకు పోలీసు అధికారులు, సిబ్బందితో నిరంతరం నిఘా పెట్టామని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. బుధవారం ఆయన నాతవరం, గొలుగొండ, కృష్ణాదేవిపేట పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్లలో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల గురించి ఆరాతీశారు. స్టేషన్ల పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీసులు, మీడియాతో మాట్లాడారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు దృష్టి సారించాలని పోలీసులకు సూచించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మద్యం బెల్ట్ షాపులు ఎక్కడా వుండడానికి ... మిగతా 8వ పేజీలో

గోవాడ షుగర్స్‌లో మళ్లీ ఆగిన క్రషింగ్



ఫ్యాక్టరీ వద్ద నిలిచిపోయిన చెరకు బండ్లు

చోడవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ టర్బయిన్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా బుధవారం ఉదయం చెరకు కషింగ్ నిలిచిపోయింది. సమస్యను చక్కదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. క్రషింగ్ ఆగిపోవడంతో ఫ్యాక్టరీ యార్డులో, కాటాల వద్ద చెరకు బండ్లు బారులు తీరాయి. గురువారం ఉదయానికి మరమ్మతు పనులు పూర్తిచేసి క్రషింగ్‌ను పునరుద్ధరిస్తామని అధికారులు చెబుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.09
సహరి (శుక్ర)	4.57

నేడు కల్లుగీత కులాల మద్యం షాపులకు లాటరీ

అనకాపల్లి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్లుగీత కులాల వారికి కేటాయించిన మద్యం షాపులకు గురువారం లాటరీ తీయనున్నట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కల్లుగీత కులాల వారికి ప్రభుత్వం 15 షాపులు కేటాయించిందని చెప్పారు. ఆయా షాపులకు 205 దరఖాస్తులు వచ్చాయన్నారు. మద్యం దుకాణాల కేటాయింపుపై అనకాపల్లి గుండాలజంక్షన్ వద్ద వున్న ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ విజయకృష్ణన్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆటో, మోటారు కార్మికులు ఆందోళన


బస్టాండ్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో, మోటారు కార్మికులు

ఎలమంచిలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆటో, మోటారు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఇక్కడి బస్టాండ్ జంక్షన్ వద్ద ప్రధాన రోడ్డుపై వారంతా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు ఏసుదాసు మాట్లాడుతూ ఆటో,మోటారు కార్మికులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. భారీగా జరిమానాలు విధించే జీవో నంబరు 21, 31లను వెంటనే రద్దుచేయాలన్నారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు అల్లిమళ్ల నాగు, బంగారు అప్పలనాయుడు, ఎన్.శివ, బాషా, విశ్వనాథం, మాణిక్యం, పల్లా రాజు, నమ్మిరాములు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో దిమిలి మాజీ సర్పంచ్ 'నగిరెడ్డి' మృతి

రాంబిల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలి పంచాయతీ మాజీ సర్పంచ్ నగిరెడ్డి ప్రభాకరరావు (83) మంగళవారం మృతి చెందారు. గత కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందినట్టు ఆయన కుటుంబీకులు తెలిపారు. నాలుగు దఫాలు ఆయన పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. గతంలో ఎలమంచిలి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన సమీప బంధువైన పప్పల చలపతిరావుపై పోటీచేసి ఓటమి చెందారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రభాకరరావు మృతి పట్ల మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, గొంతిన నాగేశ్వరరావు తదితర పెద్దలు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరిమర్శించారు. వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, వైసీపీ రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల అధ్యక్షులు పి.కిశోర్, శంకరరావు, జడ్పీటీసీ ధూళి నాగరాజు తదితరులు బుధవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

దిమిలి పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

రాంబిల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : దిమిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని లేబొరేటరీలో రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై తీశారు. రోజువారీ ఓపీని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఆర్.వెంకటేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వాధ్యుల పట్ల అప్ర మత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు.

ఆహ్లాదం గోరంత.. అవస్థలు కొండంత

- చెరువు ప్రాంతాన్ని పార్కుగా మార్చిన మునిసిపల్ అధికారులు
- అసంపూర్తి పనులతో వాకింగ్, వ్యాయామానికి వచ్చే వారికి ఇబ్బందులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు


మురుగుతో కలుషితమైన సన్యాసమ్మ చెరువు వద్ద పార్కు ప్రాంతం


నిర్వహణ కొరవడి మరమ్మతుకు గురైన జిమ్ పరికరాలు

ఎలమంచిలి, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందని ద్రాక్షలా మారుతోంది. చెరువు ప్రాంతాన్ని పార్కుగా మార్చేందుకు చేసిన ప్రయత్నాలు అసంపూర్తిగా వదిలేయడంతో కొత్త కష్టాలు ఆరంభమయ్యాయి. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని చూస్తున్నవారంతా దుమ్మెత్తి పోస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలవి. ఇక్కడి త్రిమూర్తులు స్వామి ఆలయం వెనుక ఉన్న సన్యాసమ్మ చెరువును పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలన్న సంకల్పంతో పార్కుగా అభివృద్ధి చేసేందుకు రెండేళ్ల క్రితం మునిసిపల్ అధికారులు, పాలకులు ముందడుగు చేశారు. ఇందులో భాగంగా సుమారు రెండు లక్షల రూపాయల వరకు నిధులు వెచ్చించి పార్కుగా అభివృద్ధి చేసే క్రమంలో చెరువు చుట్టూ మొక్కలు నాటారు. చెంతనే జిమ్ పరికరాలు ఏర్పాటు చేసి తమ పని అయిపోయిందన్నట్టు చేతులు దులిపేసుకున్నారు. అసౌకర్యంగానే ఉన్నప్పటికీ పిల్లలు,


పార్కులోని వాకింగ్ ట్రాక్‌పై నుంచి వాహనాల రాకపోకలు

పెద్దలు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకుని చెంతనే ఉన్న జిమ్ పరికరాలను వినియోగించుకునేవారు. అసంపూర్తి పనులపై దృష్టిసారించేవారు కరువయ్యారు. సరికదా ఈ ప్రాంతాన్ని పట్టించుకునేవారు లేకపోవడంతోప్రస్తుతం దారుణంగా తయారైంది.

ఈ చెరువు మధ్యలోనే కాకుండా వాకింగ్ చేసే స్థలం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ఇక్కడ బయటకు పోయే వీలు లేక రోజుల తరబడి నిలిచిపోయింది. ఫలితంగా అది మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ పార్కు చుట్టూ దాతలు ముందుకు వచ్చి బెంచీలు ఏర్పాటు ఏర్పాటు చేశారు. పార్కు చుట్టూ విద్యుత్ లైట్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో చీకటి పడితే కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. చెరువును పార్కుగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకుండా వదిలేయడాన్ని చూసిన వారు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకున్నాం

- ఇ.శ్రీనివాస్, ఉద్యోగి,



రోజూ వాకింగ్, వ్యాయామం చేసుకునేందుకు నాతో పాటు పలువురు ఈ పార్కుకు వస్తుంటాం. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకపోయిన సరిపెట్టుకుంటున్నాం. ఇటీవలకురిసిని వర్షాలకు నీరు మధ్యలో నిలిచిపోవడంతో దర్వాసన భరించలేకపోతున్నాం.

అన్ని విధాలా అభివృద్ధి చేయాలి

శివశంకర్, స్థానిక నాయకుడు



పట్టణంలో ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ఈ పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే అందరికీ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా మరిన్ని పరికరాలు ఏర్పాటు చేస్తే మరింతమంది వస్తుంటారు.చర్యలు చేపట్టాలి

డిగ్రీ కళాశాల విద్యార్థినులకు పెయింటింగ్ పోటీలు


విద్యార్థినులకు దిశానిర్దేశం చేస్తున్న పోలీసులు అధికారులు

ఎలమంచిలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈ నెల ఎనిమిదో తేదీన జరగనున్న నేపథ్యంలో బుధవారం ఇక్కడి కేబీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో అంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అధికారులు, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేయనున్నామన్నారు.

నేడు గొర్లె ధర్మవరంలో నల్లమారెమ్మ పండుగ



అచ్యుతాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్లె ధర్మవరంలో గురువారం నల్లమారెమ్మ పండుగ జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు సర్పంచ్ గొర్లె అశ్విని తెలిపారు. చుట్టు పక్కల సుమారు ఇరవై గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు వేసి, క్యూలైన్లు సిద్ధం చేశామన్నారు. భక్తులు తల నీలాలు సమర్పించడంతో పాటు అగ్నిగుండం తొక్కనున్నారన్నారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయన్నారు.

నేడు పూడిమడకలో గంటాలమ్మ ఆలయం ప్రారంభం

అచ్యుతాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పూడిమడక పాత బస్టాండ్ వద్ద మత్స్యకారుల ఆరాధ్య దేవత గంటాలమ్మ నూతన ఆలయం గురువారం ప్రారంభం కానుంది. ఇక్కడ చిన్న గుడిలో అమ్మవారి విగ్రహం ఉండేది. స్థానిక చేపల వ్యాపారి బాబ్జి తమ తల్లిదండ్రులు శేఖర్, రాజమ్మ దంపతుల జ్ఞాపకార్థం సొంత నిధులతో నూతన ఆలయాన్ని నిర్మించారు.

8న ఎలమంచిలి మండల సర్వసభ్య సమావేశం

ఎలమంచిలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల ఎనిమిదో తేదీన జరగనుంది. ఉదయం పది గంటలకు ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన ప్రారంభం కానున్న ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొనాల్సిందిగా ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.35 వేల నగదు స్వాధీనం

పరవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నెలపాలెం శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి పరవాడ పోలీసులు దాడి చేశారు. వారి నుంచి రూ.35 వేల నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై ఏపీ గేమింగ్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మహలక్ష్మి, కానిస్టేబుళ్లు కనకరెడ్డి, వల్లీ, మురళి, మోహన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

10లోగా క్రికెట్ జట్లు పేర్లు నమోదు చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు

పాయకరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గ స్థాయిలో నిర్వహించనున్న క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 10వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు సూచించారు. పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి వంగలపూడి అనిత పుట్టిన రోజు సందర్భంగా ఈ ఏడాది నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విన్నర్, రన్నర్ జట్లకు రూ.లక్ష, రూ.50 వేల నగదు బహుమతులతో పాటు షీల్డులు అందిస్తామని చెప్పారు. ఈ టోర్నీలో అధిక జట్లు పాల్గొనేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, వంకా వెంకటరమణ, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, రావాడ గోవిందరెడ్డి, సూరా సుబ్రహ్మణ్యం, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పీ4 సర్వేపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు

పాయకరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న పీ4 సర్వేపై ఉద్యోగులకు అవగాహన అవసరమని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు స్పష్టం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ధనవంతుల సాయంతో అతి పేదలను ఆర్థికంగా బలపర్చి మధ్యతరగతిలోకి తీసుకురావడమే పీ4 లక్ష్యంగా చెప్పారు. దీనిపై ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు. సర్వేలో గుర్తించన వారి పేర్లను ఈనెల 21వ తేదీన గ్రామసభలో తెలియజేస్తామన్నారు. అలాగే ఈ సర్వేపై మండలంలో 50 వేల మంది నుంచి అభిప్రాయ సేకరణ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్‌వో అక్బర్ పాల్గొన్నారు.

రాజానగరం పాఠశాలకు కుర్చీల వితరణ

పాయకరావుపేట రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజానగరం జడ్పీ ఉన్నత పాఠశాలకు నూకాలమ్మతల్లి గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు 20 కుర్చీలను వితరణ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రహీమ్‌కు బుధవారం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న కమిటీ సభ్యులను హెచ్‌ఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జి.శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒత్తిడి నిరోధంపై విద్యార్థినులకు అవగాహన

నక్కపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాలలో మానసిక ఒత్తిడి నిరోధంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఒత్తిడి జయించి, భవిష్యత్‌ను ఎలా ఆనందకరంగా రూపుదిద్దుకోవాలో అనే అంశాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత వివరించారు. ఈ సదస్సులను సద్వినియోగపర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో మనబాలవానిపాలెం హెచ్‌ఎం ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకన్న ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

- ఈ ఏడాది ముందే మొదలైన హడావిడి
- మాఢ వీధుల్లో సీసీ రోడ్లు, గ్రానైట్ పనులు పూర్తి
- పదేళ్ల తరువాత మళ్లీ విస్తృత ప్రచారం



ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం వ్యూ.... పుష్కరిణిలో భక్తులు స్నానాలు చేసేందుకు అమర్చిన రక్షణ రేకులు

నక్కపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఆలయంలో గ్రానైట్ పనులు పూర్తి కావడంతో ఆలయ గర్భగుడి, ప్రాకారాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. భక్తులు పుష్కరిణిలో స్నానాలు చేసేందుకు అనువైన రక్షణ చర్యలు చేపట్టారు. ఉపమాక ఆలయం నుంచి నక్కపల్లి వరకూ లైటింగ్ ఏర్పాటు చేసే పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆలయ గోపురాలు, మెట్లమార్గాలు, బేడామండపం, ఆలయ ప్రధాన రాజగోపురానికి రంగులు వేయడం పూర్తయింది. స్వామివారి తిరువీధి సేవలు, ఊరేగింపులు, రథోత్సవాలు జరిగే మాఢవీధుల్లో కొత్త సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. ఆలయ ఆవరణలో భక్తులు సేదతీరేందుకు విశాలమైన తాత్కాలిక షెడ్లను నిర్మించే పనులకు టీటీడీ ఇంజనీరింగ్ విభాగం శ్రీకారం చుట్టింది. భక్తులకు ఎటువంటి అసౌర్యం, త్వరితగతిన స్వామిని దర్శించుకునే విధంగా క్యూ లైన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు దశాబ్ద కాలం తరువాత ఈ ఏడాది జరుగుతున్న ఉత్సవాలకు విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఫ్లెక్సీలు, కటౌట్లు, కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నారు. జాతర సందర్భంగా పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హోం మంత్రి అనిత ఎస్పీకి సూచించారు. కాగా, ఉపమాక జాతరలో అమ్మకానికి గాజువాకకు చెందిన మురళీ అనే వ్యాపారి మధుర నుంచి కేరళ రకం చెరకు గెడలను ఒక లారీలో బుధవారం ఉపమాక తీసుకువచ్చారు. గురువారం నుంచి చెరకు అమ్మకాలు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కూటమి నాయకులు సూచించారు. ఈ మేరకు బుధవారం వివిధ శాఖల అధికారులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. 10వ తేదీన కల్యాణోత్సవం రోజున రికార్డు స్థాయిలో భక్తులు వస్తారని, పుష్కరిణిలో వారు స్నానాలు చేసేటప్పుడు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి సూచించారు. ఈ సమావేశంలో ఆలయ మాజీ చైర్మన్ ఆకేటి గోవిందరావు, సర్పంచ్ వీరబాబు, ఎంపీడీవో సీతారామరాజు, సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, కూటమి నాయకులు కోసూరి శ్రీను, వెలగా సుధాకర్, సురేశ్, జగదీశ్వరరావు, తోట అప్పారావు పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో విద్యుత్ కట్

నక్కపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఆపరేషన్స్ రాజశేఖర్, ఏఈ కృష్ణ బుధవారం చెప్పారు. ఉపమాక సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్నందున రాజయ్యపేట, బోయపాడు, తమ్మయ్యపేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎన్‌పీఎస్ఎస్ యాప్ వినియోగించుకోండి


కేశవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

పాయకరావుపేట రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ సూచించారు. మండలంలోని కేశవరం, రాజవరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌తో రైతులు స్వయంగా పంటల తెగుళ్లు, నివారణ చర్యలు తెలుసుకోవచ్చన్నారు. అలాగే రైతులంతా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది జి.గోపీకృష్ణ, జి.శరత్, పి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి

- ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు

పాయకరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ జి.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో నవోదయం 2.0పై బుధవారం నిర్వహించిన గ్రామసభలో సారా, గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై ఆయన అవగాహన కల్పించారు. సారా తయారీ, గంజాయి రవాణా, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా వీటిని విక్రయించినట్టు తెలిస్తే 14405 టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం సారా, గంజాయి సేవించడం వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ కళాకారులు కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కశింకోట సత్తిబాబు, దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, గంపల చినరాజు, ఇంజరపు సూరిబాబు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

'గాదె' విజయంపై పీఆర్‌టీయూ నేతల సంబరాలు

ఎస్. రాయవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో గాదె శ్రీనివాసులనాయుడు విజయం సాధించపై పీఆర్‌టీయూ నాయకులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో గర్భిణులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల్లోని అనాథలకు ఆహారాన్ని అందించారు. ఎమ్మెల్సీ గాదె ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కస్తారని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు పేర్కొన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ రాజేశ్వరి, పీఆర్‌టీయూ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలకాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి


కార్యకర్తలతో మాట్లాడుతున్న గెడ్డం బుజ్జి

పాయకరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు సంబంధించి దశ, దిశ నిర్దేశించేందుకు పాయకరావుపేట వస్తున్న జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీకి సంబంధించిన 20 మంది ఎమ్మెల్యేలు ఈ నెల 9వ తేదీన పాయకరావుపేటలోని రఘుపతి కన్వెన్షన్ హాల్‌లో సమావేశం కానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పట్టణానికి వస్తున్న పార్టీ ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికేందుకు నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెడ్డం చైతన్య, యగదాసు నానాజీ, పల్లి దుర్గారావు, జగ్గన్నదొర, ఆచంట దొర, నారపురెడ్డి పద్మ పాల్గొన్నారు.

సీజ్డ్ వాహనాలపై అధికారుల మల్లగుల్లాలు!

- నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 136 వాహనాలు
- నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో 26 వెహికల్స్ నిలిపివేత
- వెంటనే తీయించాలని కమిషనర్‌కు స్వయంగా జడ్జి లేఖ
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు సైతం డీఎస్పీకి ఆదేశాలు
- ఎక్సైజ్ అధికారులకు తలనొప్పిగా గంజాయి వాహనాలు

నర్సీపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాలతో ఎక్సైజ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వాహనాలు పెట్టుకోవడానికి జాగా లేక 26 వాహనాలు నర్సీపట్నం-చింతపల్లి రోడ్డుకిరువైపులా నిలిపి వేయడం.. వాటిని అక్కడ నుంచి తీయించాలని స్వయంగా నర్సీపట్నం సివిల్ జడి (సీనియర్ డివిజన్) దగ్గర నుంచి కమిషనర్‌కు లేఖ వెళ్లడం.. ఈ విషయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సైతం డీఎస్పీకి ఆదేశాలు జారీ చేయడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

వాహనాలు నిలపడానికి స్థలం లేక..

నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గంజాయి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు 132, మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు నాలుగు ఉన్నాయి. అద్దె భవనంలో ఎక్సైజ్ స్టేషన్ నిర్వహించడం వల్ల వాహనాలు నిలపడానికి స్థలం లేదు. దీంతో స్టేషన్ ముందు, పక్కన ప్రైవేటు స్థలంలో వాహనాలు ఒకదాని మీద ఒకటి గుట్టలు గుట్టలుగా ఉన్నాయి.

వీటితో పాటు నర్సీపట్నం-చింతపల్లి రోడ్డుకిరువైపులా మరో 26 వాహనాలు నిలిపి ఉంచారు. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఏళ్ల తరబడి వాహనాలు ఆరుబయట నిలిపి ఉంచడంతో ఎండకి, వానకి తప్పుపట్టి పాడయ్యాయి. స్పేర్ పార్ట్స్ దొంగలు విప్పుకు పట్టుకుపోయారు. వాహనాలు స్కెలిటిన్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. లోపల భాగాలన్నీ దొంగలు మాయం చేసేశారు.

వాహనాలు తీయించాలని ఆదేశాలు...

నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన కోర్టు సముదాయం ఉంది. ఆ రోడ్డులో కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలు ఉన్నాయి. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ పెరిగింది. దీంతో సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ నిలిపి ఉంచిన ఎక్సైజ్ సీజుడ్ వాహనాలను అక్కడ నుంచి తీయించాలని కమిషనర్‌కి లేఖ రాశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సైతం రోడ్డుకిరువైపులా ఉన్న ఎక్సైజ్ వాహనాలు తీయించాలని డీఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు.

జీఎస్టీ నంబరు వస్తే వాహనాలు వేలం

ఎక్సైజ్ శాఖలకు జీఎస్టీ నంబరు వచ్చిన వెంటనే రోడ్డుకిరువైపులా ఉన్న వాహనాలు వేలం వేయడానికి చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు. రోడ్డులో నిలిపి ఉంచిన 26 వాహనాలు తక్షణమే వేలం వేయాలని చూస్తున్నారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌తో వాహనాలకు విలువ కట్టించారు. గత ప్రభుత్వంలో సెబ్ ఉండటంతో పోలీస్ శాఖ జీఎస్టీ మీద వేలం వేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సెబ్‌ని ఎక్సైజ్‌లో విలీనం చేశారు. దీంతో జీఎస్టీ నంబరు వచ్చిన వెంటనే వేలం పాట నిర్వహించి, వాహనాలు బాధ నుంచి విముక్తి పొందాలని ఎక్సైజ్ అధికారులు చూస్తున్నారు.




ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో గుట్టలు ఉన్న గంజాయి వాహనాలు... నర్సీపట్నం-చింతపల్లి రోడ్డుకిరువైపులా నిలిపివేసి ఉన్న వాహనాలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోండి

▸▸ తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్

చోడవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి కె.రత్న కుమార్ సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం బాలికలకు రక్షణ కవచం లాంటిదన్నారు. ఈ చట్టం రక్షణ, హక్కులు, ఏ పరిస్థితుల్లో చట్టం వర్తిస్తుందనే అంశాలను జడ్జి వివరించారు. అలాగే మరింత మందికి ఈ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేయండి

▸▸ వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంతి



గొలుగొండ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ప్రశాంతి

గొలుగొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి తప్పనిసరిగా వివిధ రకాలైన వైద్య పరీక్షలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జోగంపేట గ్రామంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి స్వయంగా వైద్య పరీక్షలపై తనిఖీలు చేశారు. అలాగే ప్రజలతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా? లేదా? పరిశీలిస్తున్నామన్నారు. నిరంతరం రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు నెలలు దాటితే వ్యాక్సిన్ వేయించాలి

▸▸ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్



పశువులకు వేస్తున్న వ్యాక్సిన్‌ను పరిశీలిస్తున్న డీడీ చంద్రశేఖర్

దేవరాపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలు దాటిన ప్రతీ పశువుకు తప్పనిసరిగా బ్రూసెల్లా వ్యాక్సిన్‌ను వేయాంచాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మండలంలోని తారువ, మామిడిపల్లి గ్రామాల్లో జరుగుతున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. బ్రూసెల్లా వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయోజనాలు, టీకాలు వేసుకోకపోతే జరిగే నష్టాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. ఈ వ్యాక్సిన్ వేస్తే పశువులకు గాలికుంటు, ఇతర వ్యాధులు రావని చెప్పారు. అలాగే విజయనగరంలో జరగనున్న పాల పోటీలు గురించి వివరించారు. మామిడిపల్లిలో పశు వైద్యశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఈ.దినేశ్‌కుమార్, పశు వైద్యాధికారి జి.ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరం

▸▸ భారత్ స్కౌట్స్, గైడ్స్ జిల్లా కార్యదర్శి కె.రత్నకుమారి



శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

కె.కోటపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి కె.రత్నకుమారి చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందిన 44 మంది 6, 7, 8 తరగతుల విద్యార్థులకు కె.కోటపాడులో బుధవారం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు మంచి నడవడిక అలవర్చుకోవాలన్నారు. సమాజంలో భావిభారత పౌరులుగా తయారయ్యేందుకు అవసరమయ్యే శిక్షణ పొందాలని, శారీరక దారుఢ్యం పెంచుకోవాలని సూచించారు. స్కౌట్స్, గైడ్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం రిజర్వేషన్ సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ వై.సోనీ, విద్యానికేతన్ కరస్పాండెంట్ వేణు పాల్గొన్నారు.

క్షయరహిత ప్రాంతాలుగా రెండు పంచాయతీలు

చీడికాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పెదగోగాడ పీహెచ్‌సీ పరిధిలో క్షయరహిత ప్రాంతాలు రెండు పంచాయతీలు ఎంపికయ్యాయని పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఉషాచైతన్య తెలిపారు. ఇందుకోసం పెదగోగాడ, ఎ.అగ్రహారం గ్రామ పంచాయతీలను ఎంపిక చేసినట్టు జిల్లా క్షయ నివారణ కార్యాలయం వైద్య బృందం బుధవారం వెల్లడించారన్నారు. ఈ నెల 24న వరల్డ్ టీబీ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆయా పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ కార్యాలయ వైద్య బృందం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడికి సత్కారం

రావికమతం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం శ్రీహరిని బుధవారం సత్కరించారు. రావికమతం వచ్చిన ఆయనను సంఘం మండల ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో తూర్పు కాపుల కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే రాజు ద్వారా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని చెప్పారు. సంఘం మండల అధ్యక్షుడు గంజి మోదునాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.నానాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.శ్రీనివాసరావు, ముఖ్య సలహాదారు ఎ.శేషగిరిరావు, టీడీపీ సీనియర్ నాయకులు కాళింగ తాతలు తదితరులు పాల్గొన్నారు.

జికోడూరు చెత్త తొలగింపు

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

మాకవరపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కోడూరు గ్రామంలో ఎట్టకేలకు రోడ్డుపై చెత్తను తొలగించారు. 'జి.కోడూరులో రోడ్డుపై చెత్త కుప్పలు' అనే శీర్షికన ఈ నెల 3వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై ఎంపీడీవో సీతామహాలక్ష్మి స్పందించారు. ఈ మేరకు బుదవారం గ్రామంలో ఉన్న రోడ్డు చెత్తను ట్రాక్టరు సాయంతో తొలగించి బయటకు తలరించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై చెత్తను వేసిన వారికి జరిమానా విధిస్తామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి సంతోశ్ పాల్గొన్నారు.

సీతయ్యపేటలో పూడికతీత పనులు

బుచ్చెయ్యపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో సీతయ్యపేట గ్రామంలోని కాలువల్లో బుధవారం పూడికతీత పనులు చేపట్టారు. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సురేశ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మేరకు ఎక్స్‌కవేటర్ సహాయంతో పూడిక తొలంచారు. ఎన్నో ఏళ్లగా నెలకొన్న సమస్యను పరిష్కరించిన గ్రామ సర్పంచ్‌ను ప్రజలు అభినందించారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

రోలుగుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీబీపట్నం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ ఆకుల కిశోర్ తన సొంత నిధులతో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యారుల కోసం సామగ్రి కొనుగోలు చేసి అందజేశారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు

చీడికాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో నిర్మాణం పూర్తయిన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పురోహితులు కిరణ్‌శర్మతో పాటు మరో అర్చకలు ఈ కార్యమాలు చేశారు. సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, నవ గ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. ఎంపీపీ కురచా జయమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 6న విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పురోహితులు కోరారు.

83 మందిక నేత్ర పరీక్షలు

దేవరాపల్లి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 83 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వారిలో 45 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేసినట్టు వైద్యాధికారి పూజిత మేఘన, ఆప్తాలమిక్ వివేక్‌వర్మ తెలిపారు. కంటినరాలు, కను రెప్పలకు చికిత్స చేయనున్నట్టు వారు చెప్పారు. ఈ శిబిరంలో కోఆర్డినేటర్ అశ్వనీకుమార్, పర్యవేక్షకులు పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...



శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

బుచ్చెయ్యపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం రామాలయం వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 136 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 36 మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేసి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. కంటి నరాల చికిత్సకు ముగ్గురు, కంటి పైపొర చికిత్సకు నలుగురు, కంటి నుంచి నీరు కారడం నివారణ చికిత్సకు ఒకరు, కంటి రెప్పల చికిత్సకు ఒకరు, చిన్నపిల్లల కంటి చికిత్స కోసం ఒకర్ని ఎంపిక చేశారు. వీరికి ప్రత్యేక నిపుణులతో ఆసుపత్రిలోనే చికిత్స చేయడానికి శంకర్ ఫౌండేషన్‌కు రిఫర్ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ అప్తమాలిక్ ఆఫీసర్ జాన్, క్యాంప్ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, నర్సింగ్ స్టాఫ్ గీత, సాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీ4 సర్వే వేగవంతంగా పూర్తిచేయండి

రావికమతం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ4 సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకన్నబాబు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో బుధవారం సమీక్షా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని చెప్పారు. గ్రామంలో లేనివారిని కూడా గుర్తించాలని చెప్పారు. అప్పుడే పుట్టిన పసి బిడ్డలకు కూడా ఆధార్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు తప్పక సమయ పాలన పాటించాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ సీతారామస్వామి, ఈవోపీఆర్డీ భానోజీరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో వెంకన్నబాబు

రోడ్డు సౌకర్యం కల్పించాలని నిరసన



రోడ్డుపై డోలీతో నిరసన తెలుపుతున్న డొంకాడ గ్రామస్థులు

గొలుగొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): డొంకాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని బుధవారం గ్రామస్థులు వినూత్నంగా నిరసన తెలిపారు. గతులకు రోడ్డుపై డోలీతో ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని కొత్తఎల్లవరం గ్రామ పంచాయతీలో శివారు డొంకాడ గ్రామానికి గత ప్రభుత్వంలో రూ.కోటికిపైగా నిధులు మంజూరు చేసినట్టు అప్పటి పాలకులు, అధికారులు చెప్పారని, అటవీశాఖ అనుమతులు లేవని రోడ్డు పనులు నిలిపివేసినట్టు ప్రకటించారని ఈ సందర్భంగా గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

చెరకు క్రషింగ్ చేయాలని రైతుల ధర్నా



చెట్టుపల్లి కాటా వద్ద నినాదాలు చేస్తున్న రైతులు

చీడికాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చెరకు క్రషింగ్ చేయాలని బుధవారం రైతులు ధర్నా చేశారు. ఈ మేరకు చెట్టుపల్లి కాటా వద్ద నినాదాలు చేశారు. ఈ చెరకు తూనిక కేంద్రం నుంచి రోజులుగా గోవాడ షుగర్స్‌కు చెరకు తరలించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతలుఉ పాతాళం ప్రసాద్, అప్పలనాయుడు, సంతోష్, పెదదేముళ్ల, తుంపాల శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. చెట్టుపల్లి కాటా నుంచి వెంటనే యాజమాన్యం చెరకు తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ విషయం యాజమాన్యానికి తెలిసినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి చెరకు తరలించాలని వారు విన్నవించారు.

రూ.7.67 కోట్లతో అభివృద్ధి పనులు

చీడికాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.7.67 కోట్లు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు తెలిపారు. బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల ప్రజల వినతిమేరకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారన్నారు. వీరభద్రునిపేట నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల మేర కొన్నెంపూడి, గొప్పూరు గిరిజన గ్రామానికి తారు రోడ్ల కోసం రూ.5.65 కోట్లు మంజూరు చేయశారన్నారు. అలాగే జల్ జీవన్‌మిషన్‌లో భాగంగా శిరిజాం గ్రామ పంచాయతీకి రూ.40 లక్షలు, ఖండివరం పంచాయతీలో రూ.24.7 లక్షలు, జి.కొత్తపల్లిలో రూ.77.66 లక్షలు, గొప్పూరులో రూ.25 లక్షలు, జైపురంలో రూ.35 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు.

నవోదయం 2.0పై గ్రామసభలు

బుచ్చెయ్యపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండెంపూడి, చినభీమవరం, గొర్లెపాలెం గ్రామాలలో నవోదయం 2.0పై బుధవారం గ్రామసభలు నిర్వహించారు. సారా తయారీ, తాగడం వల్ల అనర్థాలను ఎక్సైజ్ సీఐ బాపునాయుడు, ఎస్ఐ ఎం.శేఖరం ఆయా గ్రామాల ప్రజలకు వివరించారు.

ఒమ్మలిలో తాటాకు ఇల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న గ్రామస్థులు

మాడుగుల రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మలి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. పాడి గేదె, పెయ్యి మంటలకు గాయాలపాలయ్యాయి. గ్రామానికి చెందిన వృద్ధులు ఉగ్గిన లక్ష్మణయ్య, అతని భార్య రాముతో కలిసి తమ పంట కల్లం వద్ద తాటాకు ఇంటిలో నివాసం ఉంటున్నారు. పక్కనే పశువులు ఉంచేందుకు తాటాకుల చిన్నపాక కూడా ఉంది. మంగళవారం రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో తాటాకు ఇంటికి మంటలు అంటుకోవడంతో గమనించిన లక్ష్మణయ్య అతని భార్యతో కలిసి ఇంటిలో నుంచి పరుగున బయటకు వచ్చేశారు. ప్రమాదంలో నిత్యావసర సరకులు, నగదు, సైకిలు కాలిపోయాయి. పక్కనే ఉన్న చిన్నపాకలో ఉన్న పాడి గేదె, పెయ్యికు శరీరంపై గాయాలయ్యాయి. రావికమతం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావు సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సర్పంచ్ సుంకరి సింహాచలంనాయుడు, టీడీపీ మండల కార్యదర్శి నందారపు సన్యాసిరావు, నాయకులు బాధితులను పరామర్శించి నష్టపరిహారం అందేలా చేస్తామని చెప్పారు.

వడ్డాదిలో అగ్నిప్రమాదం

బుచ్చెయ్యపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోపి వడ్డాది సంతబయలువద్ద బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కుబిరెడ్డి ఈశ్వరరావు, ప్రకాశ్, దొరబాబులకు చెందిన ధాన్యం కుప్పలు, పశువుల పాకలు, టైరుబళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు. ఏడాదికాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహుతికావడంతో లబోదిబోమంటున్నారు. పాకలు, కుప్పలు దూరంగా ఉన్నప్పటికీ, మంటలు అంటుకోవడంపై అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు క్లూస్‌టీమ్‌తో చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. తహసీల్దార్ ఎం.లక్ష్మి నష్టాన్ని అంచనా వేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పటుత్వం కోల్పోయి ఉన్న విద్యుత్ స్తంభం

మాడుగుల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జగ్గన్న చావడికి వెళ్లే రహదారిలో పాఠశాల ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభం అడుగుభాగం పూర్తిగా పాడైంది. సగభాగం జంగుపట్టి కట్ అయిపోవడంతో, కొంత పట్టుమాత్రమే ఉంది. దీంతో స్తంభం ఏ సమయంలో కూలిపోతుందోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పైగా ఆ విద్యుత్ స్తంభం సమీపంలో ప్రైవేటు పాఠశాల ఉండటంతో నిత్యం అటుగా విద్యార్థులు, ప్రజలు తిరగాడుతుంటారు. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు ఇవే....

మాకవరపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకతరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ దామోదరనాయుడు చెప్పారు. మండలంలోని జంగాలపల్లిలో సర్పా నదికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇసుక తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


కొనుగోలుదారుల కోసం చూస్తున్న టమాటా రైతులు


సంతలో వి క్రయానికి వచ్చిన చింత పండు

చింతపండుకు గిరాకీ.. టమాటా ధర పతనం

▸ కాశీపట్నం సంతలో పరిస్థితి

అనంతగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం వారపుసంతలో బుధవారం టమాటా ధర పతనం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ధర గిట్టుబాటు కాకున్నా రైతులు వ్యాపారులు అడిగినంతకు విక్రయించాల్సి వచ్చింది. ఈ ఏడాది సారవానిపాలెం, సీతంపేట, పల్లంవలస, ఎర్రిగెడ్డ కొత్తవలస, కాటిమానువలస, గ్రామాల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున టమాటా సాగు చేపట్టారు. అయితే, ఒక్కసారిగా పంట దిగుబడి రావడంతో గిరాకీ తగ్గి టమాటా ను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో ఒక్కో తట్ట రూ. 100 నుంచి 200 ధర మాత్రమే పలికింది. ఈ వారం ఉదయం నుంచి గిరిజనులు వ్యాపారులు కోసం పడిగాపులు కాశారు. వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించి వెనుదిరిగారు. మోత కూలి కూడా దక్కలేదని పలువురు వాపోయారు.

ఉచితంగా పశువులకు టీకాలు

▸ పశు సంవర్ధకశాఖ ఏడీ చంద్రశేఖర్


మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఏడీ చంద్రశేఖర్

చింతపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక పశువుల ప్రాంతీయ ఆస్పత్రిలో పశువైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లోస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఈనెల ఒకటి నుంచి ప్రారంభించినట్టు చెప్పారు. ఈ రెండు టీకాలను ఉచితంగా వేస్తామన్నారు. పశువుల బీమాను చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు చల్లంగి చాలిని, దేశగిరి దమయంతి పాల్గొన్నారు.

ఐటీ మంత్రి లోకేశ్ దృష్టికి పాడేరు సమస్యలు


మంత్రి నారా లోకేశ్‌తో ఎంపీపీ ప్రసాద్

కొయ్యూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాడేరు నియోజకవర్గం పరిధిలో ప్రధాన సమ స్యలను రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రికి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. బుధవారం అమరావతిలో మంత్రిని ప్రసాద్ కలిశారు. ఆ వివరాలను స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన తూ ర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్‌గా వ్యవహరించి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు కృషి చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తనను అభినందించారన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలపై లోకేశ్ ఆరా తీసి పలు సూచనలు చేశారన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టేలా అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతానని మంత్రి హామీ ఇచ్చారని ప్రసాద్ తెలిపారు.

మోదకొండమ్మను దర్శించుకున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్


మోదకొండమ్మ సన్నిధిలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ దంపతులు

పాడేరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వెలమ కా ర్పొరేషన్ చైర్మన్ వీవీజీ కుమార్ సతీసమేతంగా బుధవారం స్థానిక మోదకొండమ్మ ను దర్శించుకున్నారు. ఇక్కడికి వచ్చిన ఆయన తొలుతగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ అయ్యప్ప, వెంకటేశ్వరస్వా మిలను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక మోదకొండమ్మ ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు, తదితరులు పీవీజీ కుమార్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమి టీ ప్రతినిధులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షకు 97 శాతం మంది హాజరు


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాడేరురూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన ద్వితీయ ఇంటర్ రెండవ రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు డీఐఈవో ఎల్.అప్పలరామ్ తెలిపారు. ఇంగ్లీష పరీక్షకు జిల్లాలోని 26 పరీక్ష కేంద్రాలలో జనరల్ గ్రూపు విద్యార్థులు 5,464 మందికి 5,330 (97.54 శాతం) మంది హాజరయ్యారని, మిగిలిన 134 మంది గైర్హాజరైనట్టు చెప్పారు. అలాగే, జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పరీక్షలకు ఒకేషనల్ గ్రూపు విద్యార్థులు 1,212 మంది హాజరు కావాల్సి ఉండగా 1,137 (93.81 శాతం) మంది పరీక్ష రాయగా, 75 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు వివరించారు.

పాడేరు కేంద్రంలో...

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో బుధవారం జరిగిన పరీక్షలకు 8 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన జనరల్ గ్రూపు విద్యార్థులు 166 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 161 (96.98 శాతం)మంది హాజరయన్నారు. ఐదుగురు గైర్హాజరైనట్టు వివరించారు. ఒకేషనల్ గ్రూపు విద్యార్థులు 394 మందికి 380 (96.48 శాతం)మంది విద్యార్థులు హాజరుకాగా 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్‌సూపరింటెండెంట్ చీపురు రమాదేవి తెలిపారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ


దారకొండ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

సీలేరు, మార్చి 5 , (ఆంధ్రజ్యోతి) : ధారకొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను బుధవారం జీకేవీధి తహసీల్దార్ రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడవ తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టులు చదవగలుతున్నారా లేదా అని పరిశీలించారు. విద్యార్థులు తెలుగు మాత్రమే చదవగలిగారు. ఇంగ్లీష్‌లో చదివే నేర్పు 30 శాతం మంది విద్యార్థులకు మా త్రమే ఉ న్నట్టు గుర్తించారు. అనంతరం ఆఫీస్ రూమ్‌కు వెళ్లి పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం రేపు

సీలేరు, మార్చి 5 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండలో ఈ నెల 7వ తేదీన (శుక్రవారం) ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు స్థానిక సీఐ వరప్రసాద్ తెలిపారు. ధారకొండ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, పోలీసుల ఆధ్వర్యంలో ఈశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపరేషన్లకు గుర్తించిన వారిని ఉచితంగా ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్తామన్నారు. శస్త్రచికిత్సల తర్వాత తిరిగి స్వగ్రామాలకు పంపిస్తామని సీఐ తెలిపారు. అలాగే ఈ నెల10న గూడెంకొత్తవీధిలో ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహించనున్నామని సీఐ వరప్రసాద్ చెప్పారు

విద్యార్థినులకు స్వీయ రక్షణ అవసరం


సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ అందిస్తున్న శివకుమార్

అరకులోయ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): యువతులు స్వీయ రక్షణకు అవసరమైన శిక్షణ పొందాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. భరత్‌కుమార్‌నాయక్ అన్నారు. కళాశాలలో బుధవారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనర్ సీహెచ్ .శివకుమార్ ఆత్మ రక్షణలో మెలకువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ పి.సుందరిరాణి మాట్లాడు తూ యువతులు కరాటే తదితర శిక్షణ పొందడం ద్వారా తమకు తాము రక్షించుకోవచ్చునన్నారు. శివకుమార్ ఆత్మ రక్షణకు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సభ్యులు వై.విజయలక్ష్మి, ఎం.అనితకుమారి, కె.భవాని, కె.అంబిక, 155 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సెల్ఫ్‌డిఫెన్స్ ట్రైనర్ శివకుమార్‌ను విద్యార్థినులు సన్మానించారు.

కూటమి సంక్షేమ పాలనకు అనుగుణంగానే ఎమ్మెల్సీ ఫలితాలు

▸ జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న కిడారి శ్రావణ్‌కుమార్

అనంతగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గత తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనకు మెచ్చి ప్రజలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితాలు నిచ్చారని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని శివలింగపురం వద్ద కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎమ్మెల్సీలకు, పట్టభద్రులకు ఆయన అభినందనలు తెలిపారు. వైసీపీ రాక్షస పాలననుంచి విముక్తి కోసం ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రస్తుతం పాలన సాగుతోందని శ్రావణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. విజన్ కలిగిన నాయకుడి చేతిలో మన భవిష్యత్తు ఉందని, ప్రజలందరికీ మంచిచేయడమే లక్ష్యంగా అనేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్టు వివరించారు. త్వర లోనే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. రాష్ట్రానికి సరికొత్త ప్రాజెక్టులు, కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కె.అప్పారావు, నాయకులు జోగులు, నిర్మల, బిడ్డ లక్ష్మణరావు, శ్యామ్, నగేశ్వరరావు, శివ, రంజిత్, కుమార్, సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు గ్రామ ఉపసర్పంచికి పరామర్శ

టీడీపీ కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటామని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అ న్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కొత్తూరులో గ్రామ ఉప సర్పంచ్ నరసింహమూర్తిని శ్రావణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.. అధైర్యపడొద్దని భరోసా నిచ్చారు. పరామర్శించిన వారిలో టీడీపీ యువ నాయకుడు పి.జగన్, డొన్ను, మహేశ్, ప్రసాద్, తదితరులున్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో పీఎస్ కుమార్

చింతపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీలో సంపద (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పాడేరు డీఎల్‌పీవో పీఎస్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సంపద కేంద్రాల్లో వర్మికంపోస్టు, కంపోస్టు ఎరువులను ఉత్పత్తి చేయాలని కోరారు. సేంద్రీయ ఎరువులను విక్రయించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గృహాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల పన్నులను ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో రానున్న వేసవిలో నీటి ఎద్దడిలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జీఎస్‌డబ్ల్యూ సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురకుల పాఠశాలలో 2025-20 విద్యా సంవత్సరానికి గానూ వివిధ తరగతులలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు ప్రిన్సిపాల్ టీవీఎం మోహన్ తెలిపారు. ఈ మేరకు 5వ తరగతి 80, ఆరో తరగతి 15, 8వ తరగతి మూడు, 9వ తరగతి 2 సీట్లు ఖాళీలున్నట్టు వివరించారు. ఈ నెల 25వ తేదీలోకగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మ రిన్ని వివరాలకు స్వయంగా పాఠశాలకు వచ్చి గాని, లేదా వెబ్‌సైట్లో గాని సంప్రదించవచ్చని తెలిపారు.

లైంగిక దాడుల నిరోధం అందరి బాధ్యత

▸ డీఎండీహెచ్‌వో జమీల్‌బాషా


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమీల్‌బాషా

పాడేరురూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై లైంగిక దాడులు నిరోధానికి సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే), జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన ఒక్క రోజు ఓరియంటేషన్ ప్రొగ్రాంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌బీఎస్‌కే నుంచి వచ్చిన సైకాలజిస్ట్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలు పలు లైంగిక వేధింపుల బారినుంచి రక్షణకు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. గతంలో ఉమ్మడి కుటుంబాల వల్ల పిల్లల ఎదుగుదలకు, నైతిక అంశాలను వివరించేవారన్నారు. ప్రస్తుతం పిల్లలకు మంచి, చెడులను వివరించే బాధ్యతను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం ఆఫీసర్స్, వైద్యాధికారులు, విద్యాశాఖాధికారులు, ఏటీడబ్ల్యూవోలు, ఎస్ఎస్ఏ పీవో, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

ముంచంగిపుట్టు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిలగాడ పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనివైద్యాధికారి రమేశ్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి ప్రారంభం కావడంతో పలు వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ఈనేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎ టువంటి అనారోగ్య సమస్య తలెత్తినా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎండలోకి వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఎస్ఎస్ఏ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన


ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

పాడేరురూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చే యాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా నాయకుడు ఎస్. సింహాచలం మాట్లాడుతూ ఉద్యోగులకు హెచ్ ఆర్ పాలసీ అమలుకు కమిటీని ఏర్పాటు చేయాలని, మినిమం టైమ్‌స్కేల్, ఇతర సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలపై 2023 డిసెంబరు 20వ తేదీన సమ్మెను ప్రారంభించి ప్రభుత్వంతో ఒప్పందాలు జరిగిన తరువాత 2024 జనవరి 10వ తేదీన సమ్మెను విరమించామన్నారు. నేటి వరకు ఉద్యోగుల హెచ్‌ఆర్ పాలసీ, మినిమం టైమ్‌స్కేల్ అమలు, ఈపీఎఫ్ అమలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ, కారుణ్య నియామకాలు, జాబ్ చార్ట్, పదవీవిరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు తదితర సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి మార్చి, 5, 6వ తేదీలలో మండల కేంద్రాలలో, కేజీబీవీ స్కూల్స్ వద్ద మధ్యాహ్న భోజన విరామసమయంలో సామూహిక నిరసనలు తెలుపుతామన్నారు. ఈనెల 8వ తేదీన జిల్లా కేంద్రంలో మహిళా ఉద్యోగుల సమస్యలపై సదస్సు నిర్వహించి, మార్చి 11న విజయవాడలో నిరసన దీక్ష చేపట్టాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని ఆయన తెలిపారు.

డిగ్రీ కళాశాలలో సంప్రదాయ క్రీడలు


ఏడు పెంకులాటలో విద్యార్థినులు

చింతపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అధ్యాపకులు దేశీయ క్రీడలు నిర్వహించారు. ఈనెల 8న మహిళా ది నోత్సవం పురస్కరించుకుని ప్రిన్సిపాల్ ఎం. విజయభారతి, పీడీ శివరామ్ అరుపిక్కలు, అష్టాచెమ్మ, ఏడుపెంకులాట తదితర క్రీడలను నిర్వహించారు.

ఉచిత వివాహాలకు దరఖాస్తులు ఆహ్వానం

కొయ్యూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దాన ధర్మ చారిటబుల్ సంస్థ, టీటీడీ ఆధ్వర్యంలో పేదలకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్టు ఆయా సంస్థల ప్రతినిధులు డి. ప్రసాద్, పద్మరాజులు తెలిపారు. చిన జియ్యర్ స్వామి ఆశీస్సులతో ఏప్రిల్‌లో ఈ వివాహాలు జరిపిస్తామన్నారు.వివరాలకు ఫోన్: 73822 73833, 83670 82887, 9014294500లకు సంప్రదించాలని కోరారు.

9 నుంచి క్రికెట్ టోర్నీ

కొయ్యూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలారం బంగారు తల్లి జాతర పురస్కరించుకుని ఈనెల 9 వ తేదీ నుంచి డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నీను నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిదులు అప్పన ఆనంద్‌కుమార్, గాడి లక్ష్మీరాజ్, బం టు నాగేశ్వరావు తెలిపారు. దివంగత మాజీ సర్పంచి అప్పన శ్రీరాములు జ్ఞాపకార్థం ఏఎస్ఆర్ ప్రీమియర్ లీగ్ పేరుతో క్రికెట్ టోర్నీను నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేల నగదుతో పాటు టోర్నీ కప్, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు అందిస్తామన్నారు. క్రీడాకారులు ఫోన్: 9390219346, 9441243122 నంబర్లను సంప్రదించాలని కోరారు. జాతర నెల 22 నుంచి 27 వరకు జరుగుతుందని చెప్పారు. 23న ఎడ్ల బండ్ల పోటీలు, 25న ట్రాక్టరు రివర్స్ గేర్ పోటీలు, 27న వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

మహిళల స్వావలంబనతోనే దేశాభివృద్ధి

పాడేరురూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మినుములూరు పంచాయతీ కేంద్రంలో చైతన్య స్రవంతి సంస్థ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మాలిని మాట్లాడుతూ మహిళల పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ ప్రతినిధి అప్పికొండ శ్రీను మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ ద్వారా పీఎం విశ్వకర్మ పథకం ద్వారా వి విధ చేతివృత్తుల్లో శిక్షణను అందిస్తున్నామన్నారు. అనంతరం పాడేరు యూనియన్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ భాను శేఖర్ మహిళలకు అందించే రుణాలను వివరించారు. అనంతరం కుట్టుశిక్షణ పొందిన మహిళలలకు ఎంఎస్‌ఎంఈ వారు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో గొండెలి పంచాయ తీ సర్పంచ్ పలాసి రుజ్జమ్మ, సంస్థ ప్రతినిధులు రాజకుమార్, ఈశ్వర్, ఆనంద్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే చర్యలు


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉ ద్యో గులు విధులకు గైర్హాజరైతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం బెన్నవరం గ్రామ పంచాయతీ సందర్శించారు. సంపద కేంద్రాన్ని పరిశీలించి కంపోస్టు, వర్మి కంపోస్టు ఎరువును ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బెన్నవరం పంచాయతీలో డీఏ విధులకు గైర్హాజరుకావడంతో రెండు నెలలు జీతం నిలిపివేశామన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కి నివేదిక పంపించామన్నారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం విధిగా ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకోవాలన్నారు.

'గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు'

పాడేరురూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ఆ రోగ్యంపై నిర్లక్ష్యం తగదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెదబయలు మండలం తురకలవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో జరిగిన ఆహార కల్తీపై తక్షణమే ఐటీడీఏ అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎన్ని అక్రమాలు జరుగుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారని ఆయ న ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్‌అసిస్టెంట్లు, వాచ్‌మేన్‌లను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ, సహాయ కార్యదర్శి జి.తనీష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై ముఖాముఖీ


సమావేశంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

గూడెంకొత్తవీధి , మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని లక్కవరంపేటలో పంచాయతీ పరిధిలోని ప్రజల సమస్య పరిష్కారానికి గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కంకిపాటి వీరేంద్రప్రసాద్ అధ్యక్షతన ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించింది. పంచాయతీ పరిధిలోని 10 గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. లక్కవరపేటలో మరోసారి ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తామని ఈసందర్భంగా ఎంపీడీవో తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు ప్రభుత్వం తరపున రైతులకు అందజేస్తున్న వివిధ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు మొట్టడం సత్యనారాయణ, గిరిజన వికాస్ కార్యదర్శి సత్యనారాయణ, నేచురల్ ఫామ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పురుషోత్తం, టీడీఎఫ్ కో ఆర్డినేటర్ అనంతలక్ష్మి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

కొయ్యూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రిషి విద్యా సం స్థల్లో 50 శాతం ఫీజు రాయితీతో సీటు కేటాయిస్తామని సంస్థ స్టడీ సర్కిల్ డైరక్టర్ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలో డౌనూరు, చిట్టింపాడు, ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టేషనరీని మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్య సంస్థల ఏవో శ్రీను, పాఠశాలల హెచ్ఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో బేబీ ఫీడింగ్ గదులు

డుంబ్రిగుడ,మార్చి5(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయాల్లో శిశువులకు పాలించే గదులను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ముజిబ్, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు 'చలో విజయవాడ' రేపు


మాట్లాడుతున్న సీఐటీయూ నేత సన్నిబాబు

పెదబయలు మార్చి 5 (ఆంధ్రజ్యోతి): : ఆశ, సీహెచ్‌డబ్ల్యూల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల ఆరో తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీ యూ నేత బొండా సన్నిబాబు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు బొండా గంగాధరం, ఆశ, సీహెచ్‌డబ్ల్యూలు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ధర్మారాయుడుపేట ఎంపిక

▸▸ వ్యవసాయ శాఖ ఏడీ రామారావు వెల్లడి

▸▸ ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ రామారావు

పరవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ పద్ధతిలో రైతులంతా పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీ ఎం.రామారావు సూచించారు. మండలంలోని రావాడ పంచాయతీ ధర్మారాయుడుపేట కమ్యూనిటీ భవనం వద్ద బుధవారం సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వలన ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో వివరించారు. నూరుశాతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామంగా ధర్మారాయుడుపేటకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన ఇన్‌పుట్స్, విత్తనాల కిట్లు, కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి, గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, వెలుగు ఏపీఎం బి.రంగారావు, సీసీ విజయ కుమారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెరుగు బజార్ రోడ్డు రీ సర్వే



రోడ్డు విస్తీర్ణంపై మాట్లాడుతున్న సర్వే విభాగం అధికారులు

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పెరుగుబజార్ రోడ్డు విస్తర్ణ పనులకు సంబంధించి బుధవారం సర్వే విభాగం అధికారులు రీ సర్వే నిర్వహించారు. గతంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పుడు వంకరగా ఉండడంతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. క్రమ పద్ధతిలో విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సర్వేయర్ అధికారి గోపాలరాజు బుధవారం పెరుగుబజార్ రోడ్డును పరిశీలించారు. గతంలో ఉన్న రోడ్డు విస్తీర్ణం ప్రస్తుతం చేపట్టబోయే విస్తీర్ణానికి సంబంధించి కొలతలు వేశారు

'డిప్లమో విద్యార్థులకు మంచి అవకాశాలు'



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉమాశంకర్

కశింకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రాజీవ్ గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల కెరీర్‌కు సంబంధించిన అంశంపై బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ డిప్లమో చేసిన విద్యారినీ విద్యార్థులకు పరిశ్రమల్లో, ప్రభుత్వరంగ సంస్థల్లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. సూపర్‌వైజర్ సుచరిత, కళాశాల అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ, విభాగాధిపతులు రమణకుమార్, గణేష్, జన్మోహిని, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి : రత్నాకర్



వేడుకల్లో మాట్లాడుతున్న రత్నాకర్, చిత్రంలో సంస్థ ప్రతినిధి పాల్

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే విద్యలో రాణించడంతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని దాడి విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గుడ్ షెపర్డ్ స్కూల్ 47వ వార్షికోత్సవం బుధవారం రాత్రి స్కూల్ ఆవరణలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రత్నాకర్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యతో పాటు ఆధునికతను అందిపుచ్చుకొని దానికి అనుగుణంగా భవిష్యత్తు నిర్మించుకోవాలన్నారు. ఈ స్కూల్‌ను వినయానంద్ ప్రారంభించి విద్యార్థుల భవిష్యత్తే పరమావధిగా నడిపారని, అనంతరం అతని తనయుడు పాల్ కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారన్నారు. మరో అతిథి స్వర్ణకుమార్, స్కూల్ కరస్పాండెంట్ పాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో వ్యాపార రంగంలో అడుగిడే వారికి ప్రభుత్వాలు ప్రోత్సాహం

▸▸ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ



వర్క్‌షాపులో మాట్లాడుతున్న మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే కొత్త ఆలోచనలతో వ్యాపారాలు ప్రారంభించే దిశగా ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ పేర్కొన్నారు. భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ సహకారంతో ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, ఇన్నోవేషన్‌పై బుధవారం స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో జరిగిన వర్క్‌షాపులో మాట్లాడారు. కొత్త ఆలోచన చేసే విద్యార్థుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తున్నాయని, దానికి అనుగుణంగా భారత ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు. వాటిలో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తున్నట్టు చెప్పారు. ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మనోవికాసం పెరిగి నూతన వ్యాపారాల వైపు అడుగులు వేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఐఈఎస్ అడ్మిన్ ఎం.కాలేబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ యు. నాగేశ్వరరావు, ఎస్ఆర్ జమీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు

▸▸ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తరాదు ▸▸ వసతులు, ట్రాఫిక్, రవాణా, వైద్య సేవల్లో లోపాలు లేకుండా చూడండి

▸▸ వివిధ శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు సీతారాం

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. పట్టణంలోని జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పరీక్షా కేంద్రల్లో వసతుల లేమి, ట్రాఫిక్ ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, రోడ్డు రవాణా ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థి పరీక్షలను కోల్పోకుండా చూడాలన్నారు. ఇప్పటికే తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, డీఈవోలను అప్రమత్తం చేస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. పట్టణాల పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రాథమిక వైద్యం అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వివరించారు. గతంలో ఇబ్బందులు ఎదుర్కొన్న సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు, వాటి పై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఈవో పి. అప్పారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 20,774 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. 107 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. వీటిలో కేజీబీవీలు, మోడల్ స్కూల్స్ ఉన్నాయన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, బాలల రక్షణ అధికారి కె.ఎల్.మనోహర్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ పి.ప్రభావతి, జీసీడీవో ఎస్. పద్మ, బి.శకుంతల తదితరులు పాల్గొన్నారు.

బోదివలసలో కమ్యూనిటీ స్థలంపై వివాదం

▸▸ సర్పంచ్, గ్రామ పెద్దలపై పోలీసులకు ఫిర్యాదు

▸▸ ఇరువర్గాల వాదనలను విన్న ఎస్ఐ సింహాచలం

▸▸ తహసీల్దార్ నుంచి నివేదిక అందే వరకు స్థలం జోలికి వెళ్ల వద్దని సూచన



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సింహచలం

సబ్బవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోదివలస గ్రామంలో సుమారు రెండు సెంట్ల కమ్యూనిటీ స్థలంపై వివాదం చోటు చేసుకుంది. దీంతో గ్రామ పెద్దలతో పాటు సర్పంచ్‌పై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఎస్ఐ పి.సింహాచలం వివాదానికి కారణమైన స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థులు, ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు, గంతకోరు సూర్యనారాయణ, కంచిపాటి రాంబాబు తదితరులు మాట్లాడుతూ.. గ్రామ దేవత ముత్యమాంబ అమ్మవారి పండుగ నిమిత్తం ఇటీవల గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పండుగ సమయంలో సరైన స్థలం లేకపోవడంతో గ్రామానికి చెందిన కమ్యూనిటీ స్థలం ప్రభుత్వ పాఠశాల వద్ద ఉందన్నారు. సదరు స్థలం పూర్వం 112/1లో జిరాయితీ భూమిని గంతకోరు సూర్యనారాయణ కుటుంబీకులు పాఠశాల నిర్మాణానికి విరాళంగా ఇచ్చారన్నారు. పాఠశాల నిర్మించగా సుమారు రెండు సెంట్ల స్థలం ఉందన్నారు. ఆ స్థలాన్ని సమీపంలో ఉన్న బొజ్జ తలుపులమ్మ (మాజీ వలంటీర్), సూరిబాబు, శ్రీనివాసరావు, వరలక్ష్మి, వానపల్లి రమణమ్మ తదితరులు ఆక్రమించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వలంటీర్‌గా పనిచేసిన తలుపులమ్మ కమ్యూనిటీ స్థలంలో షెడ్డు నిర్మించినట్టు చెప్పారు. అప్పట్లో అడ్డుకున్నా దౌర్జన్యంగా షెడ్డును నిర్మించారని ఆరోపించారు. ఇప్పుడు కూడా గ్రామ దేవత పండుగ నిమిత్తం స్థలం అడగడానికి వెళితే సర్పంచ్‌తో సహా కోన అప్పారావు, రాము, నేబర్తి సన్నిబాబుపై పోలీసులకు ఫిర్యాదు చేశారని వివరించారు. గ్రామ దేవత పండుగ నిమిత్తమే తాము స్థలం ఖాళీ చేయమని అడిగితే తమపై కేసు పెట్టారని, పోలీసులు తమకు న్యాయం చేయాలని గ్రామ పెద్దలు కోరారు. ఫిర్యాదు దారులైన తలుపులమ్మ, సూరిబాబు తదితరులు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం నిర్మించుకున్నామని తమకు న్యాయం చేయాలని పోలీసులుకు విన్నవించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ స్థలానికి సంబంధించిన హక్కుదారులు ఎవరని నిర్ధారించేందుకు తహసీల్దార్‌కు లేఖ రాస్తామన్నారు. ఆ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అప్పటి వరకూ స్థలంపైకి ఎవరూ వెళ్లవద్దని ఇరువర్గాల వారికి స్పష్టం చేశారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి

▸▸ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్



ఎంఈవో కార్యాలయం ఎదుట సిబ్బంది ఆందోళన

కశింకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈవో కార్యాలయం ఎదుట బుధవారం ప్లే కార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎం.రామలక్ష్మి, టి.కృష్ణ, డి.లక్ష్మణ్, యు.రవికుమార్, డి.ఝాన్సీ, ఎం.వసంత తదితరులు మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీని ఏర్పాటు చేసి, మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ అమలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమై జాబ్ చార్ట్, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. పై సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11న విజయవాడ కేంద్రంలో నిరసన దీక్ష చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్టు చెప్పారు.

కంపోస్టు యార్డులో నిలిచిన షెడ్డు నిర్మాణం

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో ప్రస్తుతం ఉన్న కంపోస్టుయార్డు వద్ద షెడ్డు నిర్మాణ పనులు బుధవారం నిలిచిపోయాయి. షెడ్డు నిర్మాణం చేపట్టవద్దంటూ జనసేన నాయకులు మంగళవారం రాత్రి జోనల్ కార్యాలయంలోని కంపోస్టుయార్డు వద్ద నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ కాంట్రాక్టర్ బుధవారం పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. దీనిపై ఆగ్రహించిన జనసేన నాయకులు జిల్లా కలెక్టర్‌కు షెడ్డు నిర్మాణం నిలిపివేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం పనులు చేపట్టేందుకు వచ్చిన కాంట్రాక్టర్‌తో జనసేన నాయకులు మాట్లాడి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కంపోస్టు యార్డును తరలించేందుకు ప్రయత్నిస్తుండగా షెడ్డు నిర్మాణం చేయడం తగదని పేర్కొన్నారు. దీంతో నిర్మాణ పనులను నిలిపివేశారు.

పథకాలు, పింఛన్ల అమలు తీరుపై ఆరా



కొత్తపల్లి గ్రామస్థులతో సమావేశమైన బృందం సభ్యులు

కశింకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఇనిస్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (నీతి) ఆయోగ్ వివరాల సేకరణకు సంబోధి రీసెర్చ్ ఆర్గనైజేషన్ బృందం బుధవారం కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ మేనేజర్ వికాస్ మల్కర్, బృందం సూపర్‌వైజర్ సంధ్యారాణి, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్స్ లక్ష్మీకుమారి, పి.భానుచంద్ర, జి.లోకేశ్‌లు గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్ల పథకం అమలు, స్వయం సహాయక బృందాల పనితీరు, నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ వివరాలను నేరుగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురి ఇళ్లకు వెళ్లి మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ధర్మారావు, ఐకేపీ ఏపీఎం ఎస్.పార్వతి భాయ్, ఉపాధి హామీ పథకం ఏపీవో ఎం.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు పూర్తి చేయండి

▸▸ జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి చంద్రశేఖర్ దేవ్

కశింకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను శతశాతం సాధించాలని అనకాపల్లి జిల్లా వ్యాధి నిరోధక (ఇమ్యూనైజేషన్) అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్ దేవ్ ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది అన్ని వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. మందుల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం -1 పరిధిలో వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి ఎ.రామచంద్రరావు, పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిణి ఎ.మనీషా, జిల్లా కోల్డ్‌చైన్ మేనేజర్ అరుణాచలం, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి.ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి వి.ఎ. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మురుగు సమస్యకు మోక్షం



కాలువలో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేమునిగుమ్మం జంక్షన్ నుంచి నూకాంబిక ఆలయానికి వెళ్లే రహదారిలో మురుగు సమస్యకు మోక్షం లభించింది. 'మురుగెత్తిన రోడ్లు' శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో జీవీఎంసీ జీవీఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు స్పందించారు. ఆ వెంటనే రహదారిలోని పాత జగన్నాథ థియేటర్ వెనుక నిలిచిపోయిన మురుగును తొలగింపుజేశారు. కాలువల్లో పూడిక తీసి నీరు సజావుగా పారే విధంగా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో రోజూ పారిశుధ్య పనులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇక్కడి కాలువ సమస్యకు సంబంధించి గతంలో అనకాపల్లి పర్యటనకు విచ్చేసిన జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లామని శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్ తెలిపారు. కాలువ ఔట్‌లెట్ చిన్నదిగా ఉండడంతో మురుగు ప్రవాహం అధికమవ్వడం వల్ల కొన్నిసార్లు రోడ్లపై ప్రవహిస్తున్నట్టు చెప్పారు. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న రాంకీ తదితరులు

కశింకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉగ్గినపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు కలగ గోవింద ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు. స్వామివారిని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), కూటమి నేతలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

8 నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నీ

పరవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : దేశపాత్రునిపాలెంలో పోలమాంబ పండుగను పురస్కరించుకొని స్థానిక హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిదవ తేదీ నుంచి మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఔత్సాహిక క్రీడాకారులు పోటీల ప్రారంభం రోజు ఉదయం తొమ్మిది గంటలలోపు పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు కమిటీని సంప్రదించాల్సిందిగా సూచించారు.

వ్యక్తి అదృశ్యం పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు పట్టణ ఎస్ఐ డి. ఈశ్వరరావు బుధవారం తెలిపారు. ఇక్కడి లక్ష్మీదేవిపేటలోని పాత్రుడు కాలనీకి చెందిన షేక్ పాపాషా, బంగారు దుర్గాభవానీ ప్రేమ వివాహం చేసుకున్నారన్నారు. గత నెల 23వ తేదీన భార్యాభర్తలు గొడవ పడడంతో పాపాషా ఆ రోజు సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడన్నారు. నేటి వరకు తిరిగి రాకపోవడంతో భార్య దుర్గాభవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఎస్ఎన్ఎఫ్ పరిశ్రమలో భద్రతా వారోత్సవాలు



భద్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న పరిశ్రమ ఉద్యోగులు

పరవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రైవేట్ పరిశ్రమలో బుధవారం జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు భద్రతపై ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. భద్రత ప్రాముఖ్యతను వారికి వివరించారు. అనంతరం భద్రత పరికరాలను ప్రదర్శనలో ఉంచారు. ఈనెల పదో తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తామని కంపెనీ చైర్మన్ కె.రాజేంద్రన్ తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు తప్పనిసరి

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు



పశువులకు టీకాల ప్రక్రియను పరిశీలిస్తున్న డాక్టర్ రామ్మోహనరావు

సబ్బవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు సూచించారు. మండలంలోని నారపాడు శివారు అమ్ములపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఆరిపాక పశు వైద్యశాల వైద్యురాలు డాక్టర్ సర్ణలత మాట్లాడుతూ అమ్ములపాలెంలో 75 పశువులకు టీకాలు వేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కశింకోటలోని కాలువలో చెత్త తొలగింపు

కశింకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కశింకోటలోని మురుగు కాలువల్లో చెత్తాచెదారాన్ని ఎట్టకేలకు పారిశుధ్య కార్మికులు తొలగించారు. 'కశింకోటలో కదలని మురుగు' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు వెనువెంటనే స్పందించారు. పారిశుధ్య కార్మికులతో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపజేశారు. వారపుసంత రోజున కూరగాయల వ్యర్థాలు తదితరాలు వేసేందుకు ఆ ప్రాంతంలో డస్టు బిన్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దోమల నివారణకు ప్రతి వీధిలో ఫాగింగ్ చేయనున్నామన్నారు.

బెరా టెస్ట్‌కు పాట్లు!

పెన్షన్ల వెరిఫికేషన్‌లో భాగంగా ఈఎన్‌టీ ఆస్పత్రికి తాకిడి

- ఏకైక మెషీన్‌తోనే పరీక్షల నిర్వహణ
- రోజుకు ఐదుకు మించి చేయలేని పరిస్థితి
- నిత్యం తిరుగుతున్నామని పెన్షన్‌దారుల ఆవేదన


నగరంలోని ఈఎన్‌టీ ఆస్పత్రి

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో బెరా టెస్ట్ చేయించుకునేందుకు వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొద్దిరోజులుగా ఈ పరీక్ష చేయించుకునేందుకు వస్తున్న వారి సంఖ్య పెరుగు తుండడంతో ఆస్పత్రి సిబ్బందిపైనా ఒత్తిడి పడుతోంది. సాధారణంగా బ్రెయిన్‌స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ (బెరా) టెస్ట్‌ను చిన్నారుల్లో వినికిడి సమస్యను నిర్ధారించేందుకు చేస్తుంటారు. కొన్నిసార్లు పెద్దలకు శస్త్రచికిత్సల నిర్వహణలో అవసరమవుతుంది. ఈ పరీక్ష వినికిడిని నిర్ధారించి స్పష్టమైన ఫలితాన్ని అందిస్తుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వినికిడి సమస్యతో బాధపడుతూ పెన్షన్లు పొందు తున్న వారికి ఈ పరీక్ష నిర్వహించాలని నిర్ణయిం చింది.

రాష్ట్రంలో పెన్షనర్ల జాబితాలో అనర్హులు ఉన్నారన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం.. రీ వెరిఫికేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా పెన్షన్ రీ వెరిఫికేషన్ శిబిరాలను ఏర్పాటు చేసింది. దీంతో అనుమానతి కేసులను ఆయా ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇలా వినికిడి సమస్యతో బాధపడుతున్న వారంతా పెదవాల్తేరులోని ఈఎన్‌టీ ఆస్పత్రికి వస్తున్నారు. వీరికి బెరా టెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడి వైద్యులు పరీక్ష నిర్వహించిన అనం తరం సమస్య తీవ్రతను నిర్ధారిస్తారు. దీనిని బట్టి సదరు పెన్షనర్ అర్హుడా.? కాదా.? తేలుస్తారు. అయితే, ఇక్కడే ఇబ్బంది ఎదురవుతోంది. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ప్రతి వారం 60 మందికిపైగా పెన్షనర్లు ఈ టెస్ట్ కోసం వస్తున్నారు. ఇక్కడ వారందరికీ పరీక్షలు నిర్వహించ లేని పరి స్థితి నెలకొంది. ఒకే ఒక్క మెషీన్ ఉండడం.. ఒకొక్కరికీ పరీక్ష నిర్వహించేందుకు కనీసం గంట పడుతుండడంతో రోజులో ఐదారుగురికి మించి పరీక్షలు చేయలేని స్థితి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు మళ్లీ రావాల్సి వస్తోంది.

ఒకే పరికరంతో పరీక్షలు..

ఆస్పత్రిలో ఒకే ఒక్క మెషీన్ ఉంది. దీనిపై రోజుకు ఐదు నుంచి ఆరుగురికి మించి పరీక్షలు చేయలేని పరిస్థితి. ఒకవైపు ఆస్పత్రికి వచ్చే చిన్నారులకు వినికిడి సమస్యను నిర్ధారించేందుకు ఇదే పరీక్ష చేయాలి. ఈ ఫలితాన్ని బట్టే కాంక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు చేస్తారు. రోజుకి ఇద్దరు, ముగ్గురు చిన్నారులకు ఈ పరీక్షలు చేయాలి. దీనికి అదనంగా పది మంది వరకు పెన్షనర్లు వస్తున్నారు. వీరందరికీ పరీక్ష నిర్వహించడం సిబ్బందికి తలకు మించిన భారంగా మారుతోంది.

నాటు సారా తయారీకి దూరంగా ఉండాలి

- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీరామచంద్రమూర్తి

పరవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారీ చట్టరీత్యా నేరమని, దీన్ని దృష్టిలో పెట్టుకొని సారా తయారీకి దూరంగా ఉండాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. మండలంలోని ముత్యాలమ్మపాలెం సచివాలయంలో బుధవారం నాటు సారా నిర్మూలనకు గ్రామస్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏపీ ప్రొహిబిషన్ యాక్ట్ ప్రకారం నాటు సారా తయారు చేస్తే ఎనిమిది సంవత్సరాల కారాగార శిక్ష ఉంటుందన్నారు. నాటు సారా తయారీ మానుకుంటే వారికి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని వివరించారు. నాటుసారా వల్ల చాలా అనర్థాలు, ఆర్థిక అసమానతలు కలుగుతాయన్నారు. అందువల్ల నాటుసారా తయారీకి దూరంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతకాయల సుజాత, మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు, ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ వీవీ రమణ, లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, స్థానిక నాయకులు, పంచాయతీ కార్యదర్శి రజని, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళుతున్న యువకుడిపై కత్తితో దాడి

కొత్తూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం కుంచంగి గ్రామ కూడలి వద్ద బుధవారం రాత్రి ఓ యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఇతనిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి యువకుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

బుచ్చెయ్యపేట మండలం కరక గ్రామానికి చెందిన భీమవరపు నూకేశ్‌కుమార్ (28) విశాఖలోని డాక్‌యార్డులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఎనిమిది గంటల వరకు స్వగ్రామంలో స్నేహితులతో గడిపాడు. అనంతరం బైక్‌పై అక్కడి నుంచి బయలుదేరాడు. సుమారు 9.30 గంటల సమయంలో నూకేశ్‌కుమార్ స్నేహితులకు స్థానికులు ఫోన్ చేసి కుంచంగి వద్ద జరిగిన ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడని చెప్పారు. వారు వచ్చే లోగా స్థానికులు 108 అంబులెన్స్‌లో నూకేశ్‌కుమార్‌ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కొద్దిసేపటి తరువాత ఆస్పత్రికి చేరుకున్న తల్లిదండ్రులు శ్రీను, ఉమ, బంధువులు.. నూకేశ్‌కుమార్‌ను పరిశీలించగా గొంతు వద్ద కత్తితో నరికినట్టు బలమైన గాయం కనిపించింది. రోడ్డు ప్రమాదం కాదని, ఎవరో కత్తితో దాడి చేసి హత్య చేశారని వారు ఆరోపించారు. నూకేశ్‌కుమార్‌కు భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

కాపుజగ్గరాజుపేటలో భారీ చోరీ

- 800 గ్రాముల బంగారాన్ని అపహరించుకుపోయిన దొంగలు


నగలు చోరీ చేసిన కప్‌బోర్డు

కూర్మన్నపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ జరిగిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 88వ వార్డు పరిధి కాపుజగ్గరాజుపేట ఎస్టీబీఎల్ సమీపంలో గల వసుంధర గార్డెన్స్‌లో ఉప్పులూరి ఉమ అనే మహిళ పిల్లలతో కలిసి ఉంటున్నారు. ఆమె భర్త అప్పలరాజు ఉద్యోగ రీత్యా ఇత్తర్‌లో ఉంటున్నారు. ఉమ తల్లి రత్నం సమీపంలోని ఇంట్లో ఉంటున్నారు. ఆమెకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈ నెల 3వ తేదీ ఉదయం ఇంటికి తాళం వేసి పిల్లలతో కలిసి ఉమ ఆమె వద్దకు వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి బెడ్ రూమ్‌లోని బీరువా తలుపులు విరగ్గొట్టి కనిపించింది. బీరువాలో భద్రపరిచిన సుమారు 800 గ్రాముల బంగారు ఆభరణాలు (70 తులాలు) కనిపించకపోవడంతో ఆమె దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి ఉన్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విశాఖకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్


విమానాశ్రయంలో నిర్మలా సీతారామన్‌కు స్వాగతం పలుకుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, తదితరులు

గోపాలపట్నం (విశాఖపట్నం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం రాత్రి విశాఖ విచ్చేశారు. ఢిల్లీ నుంచి రాత్రి తొమ్మిది గంటలకు నగరానికి చేరుకున్న ఆమెకు విమానాశ్రయంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, పలువురు బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. గురువారం మధ్యాహ్నం నోవాటెల్‌లో జరిగే పోస్ట్ బడ్జెట్ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పాల్గొంటారు.

మహిళా దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణకు జిల్లా, మండల స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఈ నెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆమె బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంబంధిత అధికారులు సమన్వయం చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అదే రోజున మహిళల భద్రత కోసం మహిళా శక్తి యాప్‌ను, ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో స్త్రీలు, పిల్లల విభాగాన్ని ప్రారంభిస్తామన్నారు. జిల్లా, మండల స్థాయిలో కార్యక్రమం జరిగే ప్రదేశాలలో శక్తి యాప్ లోగో ఏర్పాటు చేయాలని, యాప్ గురించి మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు ఏఎస్పీ దేవప్రసాద్‌ను ఆదేశించారు.

బాలల హక్కులకు ప్రాధాన్యమివ్వాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం


సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

అనకాపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో పాల్గొనే వేలాది మంది బాలల హక్కులకు ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కొత్త అమావాస్య జాతర వార్షికోత్సవాలపై దేవస్థానం అధికారులు, స్త్రీ శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, సిబ్బందితో సీతారాం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఆలయ ఈవో ఎన్.సుజాత, అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. చంటి పిల్లలతో వచ్చే తల్లిదండ్రులకు, దివ్యాంగ బాలలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారా? అని అడిగారు. క్యూలైన్‌లో ఉండే పిల్లలకు బిస్కెట్లు, వేడి పాలు పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈవో ఎన్.సుజాత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించిన, ప్రతిపాదించిన అంశాలను అమలు చేసి బాలల హక్కుల పరిరక్షణకు తమ వంతు తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఐసీడీఎస్ పీవో కె.అనంతలక్ష్మి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వి.ప్రభావతి, కార్మికశాఖ అధికారులు కె.వసంతరావు, కె.బాలకృష్ణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, బాలల రక్షణాధికారి కెఎల్ మనోహరరావు, లీగల్ కమ్ ప్రొహిబిషన్ అధికారి బి.రమాదేవి, సామాజిక కార్యకర్తలు కె.రమ్య, డి.లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ పథకాన్ని వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ జాహ్నవితో కలిసి జిల్లా రెవెన్యూ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సభలు, వెబ్‌ల్యాండ్, ఇళ్ల స్థలాల రీవెరిఫికేషన్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 అక్టోబరు 15వ తేదీ నాటికి ఇళ్లు కట్టుకున్న వారి ఇళ్లను క్రమబద్ధీకరించాలన్నారు. 150 గజాల లోపు స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటే ఉచితంగా క్రమబద్ధీకరించాలని, అంతకు మించి స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టిన వారికి ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రుసుము వసూలు చేసి క్రమబద్ధీకరించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దన్నారు.

జాయింట్ కలెక్టర్ జాహ్నవి మాట్లాడుతూ రీసర్వేపై సభల్లో అందిన దరఖాస్తులను రెండు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అందిన దరఖాస్తులపై క్షేత్ర పరిశీలన అనంతరం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, ఎస్‌డీసీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

- అతివేగమే కారణమని పోలీసుల అనుమానం
- మృతుల్లో ఒకరిది ఎస్.రాయవరం
- ఉపాధి నిమిత్తం విశాఖకు వలస


వాసుపల్లి యశ్వంత్ కుమార్ (ఫైల్‌ఫొటో)


గొడుగు సాయికుమార్ (ఫైల్‌ఫొటో)

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి దాటాక కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరపాలెం దరి తిక్కవానిపాలేనికి చెందిన వాసుపల్లి గోపి కుమారుడు యశ్వంత్ (21), గొడుగు అచ్చిరాజు కుమారుడు సాయికుమార్ (20) స్నేహితులు. వీరు మంగళవారం స్థానికంగా జరిగిన పైడితల్లమ్మ పండగ పరసలో ఉల్లాసంగా గడిపారు. అనంతరం రాత్రి 11.30 గంటల సమయంలో ఆర్కే బీచ్‌కు అప్పాజీ బైక్‌పై వెళ్లారు. తిరిగి ఒంటి గంట సమయంలో రైల్వే న్యూకాలనీ నుంచి కంచరపాలెం వైపు వస్తుండగా న్యూకాలనీ సాయిబాబా గుడికి ఎదురుగా బైక్, చెట్టును ఢీకొట్టి ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. పరసలో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారనే విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, విచారంలో మునిగిపోయారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్.రాయవరం నుంచి నగరానికి వచ్చి...

ప్రమాదంలో మృతి చెందిన గొడుగు యశ్వంత్ కుమార్ కుటుంబ సభ్యులు ఎస్.రాయవరం నుంచి నగరానికి జీవనోపాధి నిమిత్తం వచ్చారు. సాయికుమార్ తండ్రి తిక్కవానిపాలెం సమీపంలో ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సాయికుమార్, యశ్వంత్‌లు డీ మార్టు షాపింగ్ మాల్‌లో సరుకులు డెలివరీ చేసే బాయ్స్‌గా పనిచేస్తున్నారు. ఈ విధంగా పరిచయమైన ఇద్దరూ మంగళవారం గ్రామంలో జరిగే పండగను చూసి అనంతరం ప్రమాదంలో మృతి చెందడాన్ని స్థానికులు, కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. యశ్వంత్‌కుమార్ తండ్రి గోపి, తల్లి జ్యోతి కూలిపనులతో జీవనం సాగిస్తున్నారు. యశ్వంత్ తమ్ముడు మునికుమార్ ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు.

ఇంటర్ పరీక్షకు 12,044 మంది హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 9,984 మంది హాజరుకావాల్సి ఉండగా, 9802 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 2326 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 2242 మంది పరీక్ష రాశారు.

క్రైం... crime news

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య

కొయ్యూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పొలంలో పనులు చేయకుండా జులాయిగా తిరుగుతున్నావంటూ తల్లి మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానిక ఎస్ఐ కిశోర్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బకులూరు పంచాయతీ నెల్లిపూడి గ్రామానికి చెందిన పొట్టిక రాము (24) పదో తరగతి వరకు చదివి, ఏ పనీ చేయకుండా ఇంటి వద్దనే వుంటున్నాడు. కనీసం మన పొలంలో పనులు అయినా చేయొచ్చుగదా అని తల్లి లక్ష్మి సోమవారం మందలించింది. అనంతరం ఆమె పొలానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి రాము మంచంపై అపస్మారక స్థితిలో వున్నాడు. పక్కన వాంతులు చేసుకున్న ఆనవాళ్లు వుండడంతోపాటు పురుగుల మందు వాసన రావడంతో వెంటనే కంతారం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో మంగళవారం మధ్యాహ్నం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ రాము మృతిచెందాడు. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు

70 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు


పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్ఐ రమణ, పోలీసు సిబ్బంది.

పెదబయలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తపుట్టు కూడలి వద్ద 70 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కొల్లి రమణ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని అగులపుట్టు పంచాయతీ కొత్తపుట్టు కూడలి వద్ద బుధవారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ముంచంగిపుట్టు వైపు నుంచి వస్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో రెండు బస్తాల్లో రెండు బస్తాల్లో గంజాయి లభించింది. దీంతోపాటు వాహనంలో వున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని వీఆర్వో సమక్షంలో తూకం వేసి 70 కిలోలు వున్నట్టు నిర్ధారించారు. గంజాయి రవాణా చేస్తున్న జామిగూడకు చెందిన పాంగి రామ్‌చందర్, జీకేవీధి మండలం ధారకొండకు చెందిన కిల్లో లలితను అరెస్టు చేశారు. బొలేరో వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

30 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

జి.మాడుగుల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. బుధవారం కొత్తూరు కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా వంజరి పంచాయతీ గొప్పులపాలెం గ్రామానికి చెందిన గొల్లోరి పొదల, గోనె సంచితో నడుచుకుంటూ వస్తున్నాడని, అనుమానం వచ్చి గోనె సంచిని తనిఖీ చేయగా 30 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

ఆరు కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

కశింకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆరు కిలోల గంజాయితో ఓ వ్యక్తిని అరెస్టు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కశింకోట మీదుగా గంజాయి రవాణా అవున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్, పోలీసు సిబ్బంది హైవేపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో బస్టాండ్ వద్ద ఓ యువకుడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో వెంటపడి అతనిని పట్టుకున్నారు. బ్యాగులో తనిఖీ చేయగా ఆరు కిలోల గంజాయి లభించింది. ఇతను తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లాకు చెందిన యువరాజా చిన్నస్వామిగా గుర్తించి అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్త నూకరత్నం

కె.కోటపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనవలస అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త రొంగలి నూకరత్నం బుధవారం చీమల మందును నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. పోతనవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఈ నెల ఒకటో తేదీన ఐసీడీఎస్ పీవో మంగతాయారు, సూపర్‌వైజర్ రాములమ్మ తనిఖీ చేశారు. విధులు సక్రమంగా నిర్వహించడంలేదని, రికార్డులు సరిగా లేవంటూ కార్యకర్త రొంగలి నూకరత్నంను మందలించి, రికార్డులు తమతోపాటు ప్రాజెక్టు కార్యాలయానికి తీసుకుపోయారు. మూడో తేదీన నూకరత్నం ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లి రికార్డులు ఇవ్వాలని అధికారులను కోరింది. కానీ నీ పనితీరు బాగోలేదని, జీతం నిలిపివేస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపం చెందిన నూకరత్నం బుధవారం తెల్లవారుజామున చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. సకాలంలో వైద్య సేవలు అందడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. కాగా ఐసీడీఎస్ పీవో మంగతాయారును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. పోతనవలస అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి రికార్డులు పరిశీలించగా సరిగ్గా లేవని, లబ్ధిదారులకు గుడ్లు, పాలు సక్రమంగా పంపిణీ చేయడంలేదని చెప్పారు. పైగా పాల ప్యాకెట్లను తన ఇంటి వద్ద వుంచుకుందని, దీనిపై ఆమెను మందలించి, పై అధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పానని అన్నారు. అంతే తప్ప వ్యక్తిగత దూషణలు చేయలేదని స్పష్టం చేశారు.

గంజాయి నియంత్రణకు నిరంతర నిఘా

... 5వ పేజీ తరువాయి

వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్ఐలను ఆదేశించారు. సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని చెప్పారు. చోరీలు, ఇతర నేరాల అదుపునకు రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. నాతవరం, గొలుగొండ, కృష్ణాదేవిపేట పోలీస్‌స్టేషన్లకు నూతనంగా నిర్మించిన భవనాలను నెల రోజుల్లో ప్రారంభిస్తామని ఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా ఆయా భవనాలను పరిశీలించారు. నాతవరం మండలంలో భూ వివాదాలు పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నాయని, ప్రతి వారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ వేణుగోపాల్, మండల ప్రత్యేక అధికారి నాగశిరీషల సమక్షంలో ఇరు పార్టీలను సమావేశపరిచి సమస్యలను పరిష్కరించాలని ఎస్ఐ భీమరాజుకు సూచించారు. కృష్ణాదేవిపేట స్టేషన్‌కు ప్రభుత్వం వాహనాన్ని మంజూరు చేసిందని, రెండు రోజుల్లో స్టేషన్‌కు చేరుతుందని తెలిపారు. ఎస్పీ వెంట నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరరావు, నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐలు భీమరాజు, రామారావు, వై.తారకేశ్వరరావు వున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439